జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 12 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 158 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## యూపీఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఉండవు

**కమ్యూనిస్టులు అబద్దాల ప్రచారం తగదన్న నిర్మల**

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూన్ఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో

మిగతా 2లో..

## కాళేశ్వరంలో పుష్కర ఏర్పాట్లకు గ్రీన్ సిగ్నల్

**88 కోట్ల భారీ నిధులు కేటాయించిన ప్రభుత్వం**

హైదరాబాద్,ఆగస్ట్11: పుష్కర పుణ్యస్నానాలకు కాళేశ్వరం ముస్తాబవుతోంది. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని సర్కార్ రూ.88 కోట్ల భారీ నిధులు కేటాయించింది. ఇప్పటికే క్షేత్ర పునర్నిర్మాణానికి రూ.198 కోట్లు మంజూరు

మిగతా 2లో..

## పాలిమర్ నోట్ల ట్రయల్స్‌కు గ్రీన్‌సిగ్నల్

- రూ.10, రూ.20 తయారీకి కేంద్రం ఆమోదం
- రాజ్యసభలో నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): దేశంలో కరెన్సీ నోట్ల రూపంలో కీలక మార్పునకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఒక్కో నోటు విలువ 100 కోట్ల చొప్పున మొత్తం 200 కోట్ల పాలిమర్ నోట్లను ఫీల్డ్ ట్రయల్స్ కోసం తీసుకురానున్నారు. ఆ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో

మిగతా 12 లో..

## జనగణమన తరహాలో వందేమాతరం

**చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం**

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం

మిగతా 12 లో..

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపిల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా

**పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపిల పరస్పర నినాదాలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గందరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను సజావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష

మిగతా 12 లో..

## బషర్ అల్-అసద్‌కు ఉరిశిక్ష

**మరణశిక్ష విధించిన సిరియా కోర్టు**

న్యూఢిల్లీ,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్–అసద్‌కు అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. సుమారు 5 లక్షల మంది ప్రాణాలు కోల్పోయిన 14 ఏళ్ల సిరియా అంతర్యుద్ధంలో మానవత్వానికి వ్యతిరేకంగా దారుణమైన యుద్ధ నేరాలకు

మిగతా 12 లో..



# చుట్టూ సమస్యల సుడిగుండమే!?

## నేటి సమాజం లో డబ్బున్నా డబ్బులేకున్నా... మనిషికి సమస్యలే!

- సంపద ఉంటే సంరక్షణ భయం... లేకుంటే అవసరాల ఆందోళన...
- మధ్యతరగతికి రెండింటి మధ్య నిత్యపోరాటం!
- సంపాదన తక్కువ....ఖర్చులు ఎక్కువ భవిష్యత్తుపై ఆందోళన..
- మనిషి ఆశాజీవి.. ఉన్నదా నిలోనే సంతృప్తి పడాలి..
- జీవితం ఒక సమరం. కష్టన్ని ఇష్టం గా మార్చుకొని చేసే వృత్తిని దైవంగా భావించి పని చేయాలి
- మధ్యతరగతి కుటుంబం గురించి 'ప్రజా జ్యోతి ' ప్రత్యేక కథనం..



నేటి కాలంలో డబ్బు జీవితానికి అవసరం... కానీ జీవితమే డబ్బు కాదు. డబ్బు ఉన్నవారికి ఒక రకమైన సమస్యలు, డబ్బు లేనివారికి మరో రకమైన కష్టాలు, మధ్యతరగతి కుటుంబాలకు మాత్రం ఉన్నదానిని కాపాడుకుంటూ, లేనిదాన్ని సమకూర్చుకుంటూ సాగించే నిరంతర పోరాటం. బయటికి ప్రతి ఒక్కరి జీవనశైలి భిన్నంగా కనిపించినా, ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక ఆందోళన, బాధ్యత, భయం, ఆశ, భవిష్యత్తుపై అనిశ్చితి తప్పడం లేదు. పెద్ద ఇల్లు, ఖరీదైన వాహనాలు, వ్యాపారాలు, ఆస్తులు, విలాసవంతమైన జీవనం ఉన్నవారికి ఎలాంటి కష్టాలు ఉండవని చాలామంది భావిస్తారు. కానీ సంపద పెరిగే కొద్దీ దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా పెరుగుతుంది. ఆస్తుల నిర్వహణ, వ్యాపార ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతలు, పిల్లల భవిష్యత్తు, వారసత్వ సమస్యలు, నమ్మకమైన సంబంధాలపై సందేహాలు... ఇలా సంపన్నుల జీవితంలోనూ అనేక మానసిక ఒత్తిళ్లు ఉంటాయి. డబ్బు సమస్యలను పూర్తిగా తొలగించదు... సమస్యల స్వరూపాన్ని మాత్రమే మార్చుతుంది.

ఆదిలాబాద్ టౌన్ , ఆగస్టు 10(ప్రజాజ్యోతి):

**డబ్బు లేకుంటే ప్రతి అవసరం ఒక ప్రశ్నే!**

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో రోజువారీ జీవితం ఒక పోరాటంలా సాగుతుంది. ఆహారం, ఇంటి అద్దె, పిల్లల చదువు, వైద్యం, దుస్తులు, ప్రయాణం వంటి కనీస అవసరాలకే డబ్బు సమకూర్చుకోవాల్సి వస్తుంది. అనారోగ్యం వస్తే వైద్యం ఎలా? పిల్లల చదువు ఎలా కొనసాగించాలి? అనుకోని ఖర్చు వస్తే ఎవరిని ఆశ్రయించాలి? అనే ప్రశ్నలు నిరంతరం వెంటాడుతుంటాయి. పేదరికం జేబును మాత్రమే ఖాళీ చేయదు... కొన్నిసార్లు ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది.

**మధ్యతరగతి.. . రెండు ప్రపంచాల మధ్య నడిచే జీవితం!**

పేదరికం పూర్తిగా లేకపోయినా, సంపన్నుల మాదిరిగా ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం మధ్యతరగతి కుటుంబాల ప్రత్యేక పరిస్థితి. పిల్లలకు మంచి విద్య, సొంత ఇల్లు, వాహనం, ఇవన్నీ ఉన్న మళ్లీ ఇంటిలో అవసరాలకు టీవీ, కూర్చోడానికి విలాసవంతమైన సోఫా, సోఫా బాగుండడానికి దానిపై పోమ్ , భార్య,తల్లిదండ్రుల వైద్యం, పిల్లల వివాహాలు, భవిష్యత్తు కోసం పొదుపు.. కానీ మధ్యతు తరగతి యజమానికి ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకోవడమే వారి

మిగతా 2 లో..

## రేవంత్ షెల్ కంపెనీల అక్రమ కేటాయింపు

- త్వరలోనే వారి బండారం బయటపెడతాం
- సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు
- తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్




హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు. సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరు పేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి

మిగతా 12 లో..

## ఆ సంస్థతో సీఎం సోదరుడికి సంబంధం లేదు

- నిబంధనల మేరకే సంస్థకు భూ కేటాయింపులు
- తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): టెసరాట్ సంస్థకు భూ కేటాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం సోదరులకు భూ కేటాయింపులు

మిగతా 12 లో..

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

**మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ**



హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల

మిగతా 12 లో..

## మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు

మిగతా 2 లో..



# ఆలస్యం చేయొద్దు

- పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి
- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్–2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు.

మిగతా 2 లో..

## ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

- యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా

మిగతా 2 లో..

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

**అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం**

హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్

మిగతా 2 లో..

# 3.43కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06కోట్ల 'స్మార్ట్' ఆహార భద్రత కార్డులు అందిస్తాం
- ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- 2025 నుంచి కొత్తగా 16.32 లక్షల కార్డులు అందించాం
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్




హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్దిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ

మిగతా 2 లో..

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- సత్వార్ వద్ద ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్
- ఏడుగురు మృతి, ఐదుగురికి గాయాలు
- మృతులను కర్ణాటక వాసులుగా గుర్తింపు

సంగారెడ్డి,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 9మంది దుర్మరణం చెందారు. ఈ రెండు వేర్వేరు ప్రమాదాలు జిల్లాలో జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురికి

మిగతా 12 లో..

# సంపాదకీయం

## ఎవరి కోసం వీరి ఆందోళనలు?

పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ఫ్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో ఢిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

## మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

మొదటిపేజీ తరువాయి..

జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# ఆలస్యం చేయొద్దు

మొదటిపేజీ తరువాయి..

హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ



పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ పక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# 3.43కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత



మొదటిపేజీ తరువాయి..

కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. ÷ాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్దిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్దిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్దిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్దిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్దిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్దిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు?3.43 కోట్ల లబ్దిదారులు?ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో జరిగే పంపిణీ కార్యక్రమాలను క్రమశిక్షణతో, పారదర్శకంగా, నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# చుట్టూ సమస్యల సుడిగుండమే!?

మొదటిపేజీ తరువాయి..

ప్రత్యేకత.. .ఇలా అనేక బాధ్యతలను ఒక పరిమిత ఆదాయంతోనే నెరవేర్చాల్సి ఉంటుంది. నెల జీతం వచ్చిన కొద్దిరోజుల్లోనే ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల ఫీజులు, రుణ వాయిదాలు, నిత్యావసర ఖర్చులు అంటూ ఆదాయం అనేక దారుల్లోకి వెళ్లిపోతుంది. మధ్యతరగతి వ్యక్తి బయటకు సంతోషంగా కనిపించినా, లోపల మాత్రం "ఈ నెల ఖర్చులు ఎలా సర్దుబాటు చేయాలి? పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనుకోని ఖర్చు వస్తే ఏం చేయాలి?" అనే ఆలోచనలతో సతమతమవుతుంటాడు. పేదవాడిలా జీవించలేడు... ధనవంతుడిలా ఖర్చు చేయలేడు. సమాజంలో తన స్థాయిని నిలబెట్టుకోవాలనే ఒత్తిడి కూడా అతనిపై ఉంటుంది.

### ఇతరులతో పోల్చుకోవడం మరో పెద్ద సమస్య

ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఇతరుల జీవనశైలిని మన జీవితంతో పోల్చుకోవడం పెరిగింది. ఎవరో కొత్త కారు కొన్నారు, ఇంకొకరు కొత్త ఇల్లు కట్టారు, మరొకరు విదేశాలకు వెళ్లారు, ఇంకొకరి పిల్లలు ఉన్నత ఉద్యోగాల్లో చేరారు. వాటిని చూసి మన జీవితాన్ని తక్కువగా భావించడం మొదలైతే మనకు ఉన్న ఆనందం కూడా తగ్గిపోతుంది. మన ఆదాయాన్ని కాకుండా ఇతరుల జీవనశైలిని ప్రమాణంగా చేసుకుంటే అసంతృప్తి తప్పదు. అవసరం లేని వస్తువులను కేవలం ఇతరుల వద్ద ఉన్నాయనే కారణంతో కొనడం, ఆర్థిక స్థోమతకు మించిన జీవనశైలిని అనుసరించడం, చూపు కోసం అప్పులు చేయడం భవిష్యత్తులో ఆర్థిక ఒత్తిడికి కారణమవుతాయి.

### డబ్బు కోసం కుటుంబాన్ని కోల్పోవద్దు!

డబ్బు సంపాదించడానికి జీవితమంతా పరుగెత్తుతూ కుటుంబానికి సమయం ఇవ్వకపోతే, ఒక దశలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు ఎంతో సంపాదించినా ఎంతో కోల్పోయిన భావన కలగవచ్చు. పిల్లలకు ఖరీదైన వస్తువులు కొనిపెట్టడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. వారితో మాట్లాడటం, వారి మాట వినడం, సమయం కేటాయించడం, మంచి విలువలు నేర్పించడం కూడా అంతే ముఖ్యం. అలాగే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు డబ్బు అందించడం మాత్రమే కాకుండా, వారి పక్కన కూర్చొని మాట్లాడటం, వారి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం, "మేమున్నాం" అనే భరోసా



ఇవ్వడం కూడా అవసరం. డబ్బు సౌకర్యాన్ని కొనగలదు... కానీ అనుబంధాన్ని కొనలేదు.

### డబ్బు సంపాదించాలి... కానీ డబ్బుకు బానిస కాకూడదు!

ఆర్థిక భద్రత ప్రతి కుటుంబానికీ అవసరమే. సంపాదించాలి, పొదుపు చేయాలి, అవసరమైన చోట పెట్టుబడి పెట్టాలి, అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలి. అదే సమయంలో ఆరోగ్యం, కుటుంబం, స్నేహం, మానవత్వం, నైతిక విలువలు, మానసిక ప్రశాంతత వంటి జీవిత సంపదలను కూడా కాపాడుకోవాలి. పిల్లలకు డబ్బు విలువతో పాటు డబ్బే జీవితం కాదని నేర్పాలి. అవసరం–కోరిక మధ్య తేడా తెలుసుకోవడం, పొదుపు చేయడం, కష్టపడి పనిచేయడం, ఇతరులను గౌరవించడం, ఉన్నదానితో సంతృప్తి చెందడం వంటి విలువలు చిన్న వయస్సు నుంచే అలవర్చాలి. చివరికి మనిషి సంపాదించేది కేవలం డబ్బు, ఆస్తులు మాత్రమే కాదు. మంచి పేరు, నమ్మకమైన సంబంధాలు, కుటుంబ ప్రేమ, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, సమాజానికి చేసిన సేవ కూడా అతని నిజమైన సంపదే. "డబ్బు మన చేతిలో ఉండాలి... మనం డబ్బు చేతిలో ఉండకూడదు!" డబ్బున్నప్పుడు అహంకారం వద్దు. డబ్బు లేనప్పుడు నిరాశ పడవద్దు. మధ్యతరగతిలో ఉన్నప్పుడు అసూయ వద్దు. పరిస్థితులు శాశ్వతం కావు. ఈ రోజు ఉన్న స్థితి రేపు మారవచ్చు. కానీ మనిషి విలువ అతని బ్యాంకు ఖాతాతో కాదు... అతని ఆలోచన, ప్రవర్తన, మానవత్వం, కుటుంబాన్ని కాపాడుకునే తీరు, సమాజానికి చేసే మేలుతో నిర్ణయించబడుతుంది. జీవితం ఒక బ్యాంకు ఖాతా కాదు... మనం కూడబెట్టుకున్న మానవ సంబంధాలే అసలైన సంపద అని అన్నారు. ఇదే ప్రతి మధ్యతరగతి కుటుంబ పోరాట గాధ......

అన్నంవార్ దత్తు ( ప్రజా జ్యోతి )
ఆదిలాబాద్, టౌన్

# నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

- నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదు
- ప్రజలకు మాట ఇచ్చాం.. మాట ప్రకారం చేసి తీరాల్సిందే
- ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తిచేయాలి
- మ్యాన్ పవర్ పెంచి.. మూడు షిఫ్టుల్లో పనులు చేయాలి
- రాత్రి వేళల్లో కూడా నిరంతరాయంగా పనులు చేయండి
- కారిడార్ కింద బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని,నిర్లక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి,పలువురు అధికారులు,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అటు వైపు నిత్యం ప్రయాణించే వారికి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని,అందుకోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం...మాట ప్రకారం చేసి తీరాల్సిందేనని సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబుదారిగా వ్యవహరిస్తుందనీ,ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని,అందుకు అనుగుణంగా అధికారులు మనసుపెట్టాలని ప్రత్యేకంగా కోరారు. మ్యాన్ పవర్ పెంచి..మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు



నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి ఆదేశించారు.కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి సమీక్షిస్తానని.. అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ÷-రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు.. సైట్ లోని కచ్చితమైన వాస్తవ పరిస్థితులు చెప్పాలని మంత్రి అధికారులు,వర్క్ ఏజెన్సీని అడిగారు. ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ 60? మేర పనులు పూర్తయ్యాయని మరో 40శాతం పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు,వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలనీ మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి ఆరా తీశారు..ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని,రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా విజ్ఞప్తి చేసింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం..ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఆలోచించాలని మంత్రి అన్నారు. వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## యూపీఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఉండవు

మొదటిపేజీ తరువాయి..

ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఛార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి, ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత... వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు. సమాధానం వినే ధైర్యం లేని పిరికిపందలని విమర్శించారు.

## కాళేశ్వరంలో పుష్కర ఏర్పాట్లకు గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి..

కాగా, తాజాగా గ్రామీణాభివృద్ధి, గోదావరి తీరం సుందరీకరణ, అష్టతీర్థాల అభివృద్ధి, రహదారుల విస్తరణకు నిధులు కేటాయించడంతో కాళేశ్వరానికి కొత్త రూపు రానుంది. పుష్కరాల నాటికి పనులు పూర్తిచేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. వచ్చే ఏడాది జులైలో కాళేశ్వరంలో జరగనున్న గోదావరి పుష్కరాలకు త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అష్టతీర్థాల అభివృద్ధికి రూ.60 కోట్లు, నీటిపారుదల శాఖకు, రహదారుల అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.20 కోట్లు, పీఆర్‌కు రూ.5.90 కోట్లు, దేవాదాయశాఖ రూ.2 కోట్లు కేటాయించింది. అన్నారం-చంద్రుపల్లి మధ్యనున్న చంద్రుపల్లి వాగు లోలెవల్ వంతెన నిర్మాణం జరగనుంది. కాళేశ్వరంలో పలుమార్లు జరిగే పుష్కరాలకు క్షేత్రానికి చేరడానికి పోలీసు అధికారులు గతేడాది జరిగిన సరస్వతీ పుష్కరాల్లో మార్గాలను గుర్తించారు. ఆయా పట్టణాలు, ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను కాటారం మండలం బస్వాపూర్, కొయ్యూర్, గంగారాం క్రాస్ నుంచి దామెరకుంట, అన్నారం, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకునే విధంగా, వెళ్లే వాహనాలు కాళేశ్వరం, మహదేవపూర్, కాటారం మీదుగా గమ్యస్థానాలకు చేరుకునే విధంగా రూపకల్పన చేశారు.కాళేశ్వరం గోదావరి తీరం వెంట అష్టతీర్థాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టనున్నారు. తీరం వెంట వరుసగా పుష్కరఘాట్‌ల నిర్మాణాలు చేపట్టనున్నారు. అయితే ఈ నెల 14న నిర్మాణాలకు సంబంధించి టెండర్లు తెరవనున్నట్లు తెలిసింది. పంచాయతీరాజ్ శాఖకు రూ.5.90 కోట్లు కేటాయించగా, కేవలం ప్రధాన రహదారికి రూ.92 లక్షలు కేటాయించడంతో విస్తరణ లేక ప్రస్తుతం ఉన్న దారిపైనే తిరిగి రహదారి నిర్మాణం చేపడతారని తెలుస్తోంది. స్థానికులు కోరుకున్నట్లు ప్రధాన మార్గం 60 ఫీట్ల విస్తరణ, ఇరువైపులా మురుగు కాలువలు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఇప్పట్లో ఉండదని స్పష్టమవుతోంది.

## ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

మొదటిపేజీ తరువాయి..

స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు.

# ఫోన్ రాగానే క్షణాల్లో కదలాలి!

**108, 102 సిబ్బందికి అధికారుల ఆదేశం**



**ఆసిఫాబాద్, ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** అత్యవసర ఫోన్ కాల్ వచ్చిన వెంటనే క్షణాల్లో స్పందించి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 108, 102 వాహనాల సిబ్బందికి అధికారులు సూచించారు. వర్షాకాలంలో అత్యవసర కేసులు పెరిగే అవకాశం ఉన్నందున వాహనాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాంకిడి మండల కేంద్రంలో ఉన్న 108, 102 అత్యవసర వైద్య వాహనాలను అత్యవసర వైద్య సేవల సంస్థ ఆరోగ్య అధికారి కిషోర్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యవసర వైద్య సేవల ఇంజినీర్ క్రాంతి మంగళవారం తనిఖీ చేశారు. వాహనాల్లోని వైద్య పరికరాలు, మందుల నిల్వ, ఇతర సామగ్రి పనితీరును పరిశీలించారు. అలాగే వాహనాల పనితీరు, నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు, జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర ఫోన్ వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించాలన్నారు. వాహనాల్లోని వైద్య పరికరాలు, మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలు అందించాలని సూచించారు. మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108, 102 సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 108 వైద్య సాంకేతిక నిపుణుడు ప్రవీణ్ యాదవ్, వాహన చోదకులు కొమురయ్య, సీతారామ్ పాల్గొన్నారు.

# పనిముట్లు ఇవ్వకుండా రేజింగ్ ఎలా చేయాలి..?

**- కార్మికుల భద్రతను గాలికొదిలేసిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు**
**- మెడికల్ బోర్డుకు వచ్చిన వారందరినీ అన్‌ఫిట్ చేసి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి**
**- టీబీజీకేఎస్ వ్యవస్థాపక కన్వీనర్ కెంగర్ల మల్లయ్య**





**మంచిర్యాల, 11,ఆగస్టు (ప్రజాజ్యోతి) :** సింగరేణి కార్మికుల భద్రతను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు గాలికొదిలేశాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య (టీబీజీకేఎస్) వ్యవస్థాపక కన్వీనర్ కెంగర్ల మల్లయ్య ఆరోపించారు .తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య (టీబీజీకేఎస్) చేపట్టిన బాయిబాట కార్యక్రమంలో భాగంగా టీబీజీకేఎస్ వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లయ్య శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గనిలోని సీనియర్ కార్మికులు కేంగర్ల మల్లయ్యను కలిసి తమ సమస్యలను వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. గనిలో రేజింగ్ రావాలని తాము కోరుకుంటున్నప్పటికీ, రేజింగ్ పనులు నిర్వహించడానికి అవసరమైన సరైన పనిముట్లు ఇవ్వడం లేదని తెలిపారు. ముఖ్యంగా డ్రిల్ బిట్లు, ఫ్యూస్, రేజింగ్ క్యాప్సుల్‌తో పాటు ఇతర అవసరమైన పనిముట్లు అందించడం లేదని, దీంతో విధులు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మల్లయ్య దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైన పనిముట్లు, భద్రతా పరికరాలు లేకుండా పనులు చేయాల్సి రావడం వల్ల తమ భద్రతపై ఆందోళన నెలకొంటోందని కార్మికులు వాపోయారు. కార్మికుల సమస్యలను విన్న కేంగర్ల మల్లయ్య మాట్లాడుతూ, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన యాజమాన్యం అవసరమైన పనిముట్లు, భద్రతా పరికరాలను సకాలంలో అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. రేజింగ్ వంటి ప్రమాదకరమైన పనుల్లో ఉపయోగించే డ్రిల్ బిట్లు, ఫ్యూస్, రేజింగ్ క్యాప్సుల్స్ తదితర పరికరాలు అందుబాటులో లేకుండా కార్మికులతో పనులు చేయించడం సరికాదన్నారు. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించిన తర్వాతే ఉత్పత్తి, పనులపై దృష్టి పెట్టాలన్నారు. సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పైరవీలకే పరిమితమైపోయాయని కేంగర్ల మల్లయ్య ఆరోపించారు. కార్మికుల రక్షణ, భద్రతను గాలికి వదిలేశారని విమర్శించారు. గనుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను గుర్తించి, అవసరమైన పనిముట్లు, భద్రతా పరికరాలు అందేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సంఘాలు ఆ బాధ్యతను విస్మరిస్తున్నాయని అన్నారు. కార్మికుల సమస్యలపై టీబీజీకేఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, బాయిబాట కార్యక్రమం ద్వారా గనులను సందర్శించి కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని తెలిపారు. ఇదే సమయంలో సింగరేణిలో జరుగుతున్న మెడికల్ బోర్డు ప్రక్రియపై కూడా కేంగర్ల మల్లయ్య తీవ్రంగా స్పందించారు. మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల్లో కేవలం 20 శాతం మందిని మాత్రమే అన్‌ఫిట్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మెడికల్ బోర్డు పెట్టుకున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేసి, వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో పని చేయలేని స్థితికి చేరుకున్న కార్మికులకు న్యాయం జరిగేలా మెడికల్ బోర్డు విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అర్హత ఉన్న ప్రతి కార్మికుడికి న్యాయం చేయాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు టీబీజీకేఎస్ తరపున పోరాటం కొనసాగిస్తామని కేంగర్ల మల్లయ్య స్పష్టం చేశారు. గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన పనిముట్లు అందించడం, భద్రతా ప్రమాణాలు పాటించడం, కార్మికుల ఆరోగ్య సమస్యలకు న్యాయం చేయడం యాజమాన్యం, సంబంధిత సంఘాల ప్రధాన బాధ్యత అని అన్నారు. ఈ బాయిబాట కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ముదిగిరి మల్లేష్, నాగుల మోహన్‌రావు, దొడ్ల సతీష్, పెండ్యాల శ్రావణ్, దాసరి అఖిల్, జక్కుల శంకర్, శేఖర్, భాస్కర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

**వరి సాగులో నీటి లభ్యతపై ముందుచూపు అవసరం: కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ముందుగానే పరిశీలించుకోవాలన్నారు. జిల్లాలో వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ వరి సాగుకు సరిపడా నీరు అందకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్నామని, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకుని అధిక దిగుబడులు, లాభాలు పొందాలని కలెక్టర్ కోరారు.

# ఉచిత పథకాలపై హైకోర్టు జడ్జి ఆవేదన సోషల్ మీడియాలో వైరల్

**- ప్రభుత్వాన్ని, ప్రజల్ని ఆలోచనవైపు మరలించిన వైనం - "ప్రజా జ్యోతి" ప్రత్యేక విశ్లేషణ**

**ఖానాపూర్ ఆగస్టు 11(ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ ఉచిత పథకాలతో అర్హులు అనర్హులు (పేద వర్గాలు ఉన్నత వర్గాలు) అనే తేడా లేకుండా అమలు కావడంతో హైకోర్టు జడ్జి ఆవేదనతో పలికిన మాటలు వాస్తవానికి దగ్గరగా ఉండడంతో సోషల్ మీడియాలో వైరల్ గా మారి చెక్కర్లు కొడుతోంది ఈ మేరకు నిర్మల్ జిల్లాలో సామాన్య ప్రజానీకంతో పాటు యువత పట్టభద్రులు ప్రజాప్రతినిధులు ఉద్యోగ ఉపాధ్యాయులు నాయకుల్లో ఇదే చర్చ కొనసాగడం "ప్రజా జ్యోతి" దృష్టికి వచ్చింది తెలంగాణ రాష్ట్రం తో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఉచితాల వల్ల భవిష్యత్తులో రాష్ట్రాలు ప్రభుత్వాల పరిస్థితి ఏరకంగా మారనందోనని మేధావులు విశ్లేకరిస్తున్నారు వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాలు వ్యతిరేకించకుండా అర్హులకు అందడం సమంజసమైన పార్టీలు ప్రలోభాలు పైరవీలు వెరసి ఉన్నత వర్గాలకు కూడా ఈ పథకాల వర్తించడంతో నిర్వీర్యం అయిపోతుందని సామాన్యమైన ప్రజానీకం సైతం ఆలోచించే పరిస్థితి నెలకొంది రేషన్ కార్డులు మొదలుకొని వివిధ రకాల పెన్షన్లతోపాటు రైతుబంధు రైతు బీమా పథకాలకు ఓ పరిధి లేకుండా పోవడంతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని దీంతో ప్రభుత్వ ఖజానా కూడా గండిపడుతుందని భవిష్యత్తులో ఏం జరుగుతుందో అన్న "ప్రశ్న"

ఈ వీడియోలో జడ్జి ఆవేదన చర్చనీయాంశంగా మారింది రైతుకు వ్యవసాయాలు చేసే పరిస్థితుల్లో కూలీలు దొరక్కుండా ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యక్షంగా పరోక్షంగా తీసుకొచ్చి పనులు జరిపించుకుంటున్న వైనం కళ్ళకు అద్దినట్లు ఇది నిజం అన్న వాస్తవం ప్రజల్లో పాలకుల్లో అధికార అనాధికారుల్లో నాయకుల్లో కొట్టొచ్చినట్లు కనపడుతుంది పేద బడుగు బలహీన,తాడిత పీడిత ప్రజా వర్గాలకు ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు అర్హులకు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం ప్రజాప్రతినిధులు ఇచ్చే బాధ్యత కూడా ఉన్న ఇందులో పైరవీలు పార్టీలు తమ వర్గాలు తమ సంఘాలు అంటూ అనర్హులైన వారికి ఇప్పించడంలోనే రాష్ట్ర ఖజానాకు గండి పడుతుందన్న భావన కలుగుతుంది గతంలో ప్రభుత్వం కొనసాగించిన పథకాలను రద్దు చేస్తే ఈ పార్టీ ప్రభుత్వానికి ఏమవుతుందో అన్న మిమాంసంలో ప్రజా ప్రతినిధులు పాలకవర్గాలు స్థానిక నాయకత్వాలు నోరు మెదపక పోవడం తిరిగి అధికారం దక్కించుకోవడమే ధ్యేయంగా ఖజానాకేం అవుతుందో తెలియకుండా వ్యవహరించడం తప్పనిసరి అవుతుంది.

అయితే ఈ ఉచిత పథకాన్ని ఉన్నత వర్గాలవాళ్ళు తీసుకోవడం స్వచ్ఛందంగా ఆపేస్తే నిరుపేద బడుగు బలహీన మధ్యతరగతి అర్హులకు చేరుతుంది రైతు బంధు రైతు బీమా కు నిరుపేద మధ్యతరగతి వాళ్ళకి గిన్ని ఎకరాలు అని కట్టుదిట్టం చేస్తే 50 శాతం మేరకు ఇప్పుడు ప్రభుత్వ గండికి మేలు(మిగులు)అవుతుందని తెలుస్తోంది మేధావులారా ఉన్నత వర్గాలు భూస్వాములు ఆర్థికంగా ఎదిగిన వారు ఈ పథకాలను స్వచ్ఛందంగా మానుకుంటే తప్ప మేలు జరగదన్న నిజాన్ని గమనించాల్సిన అవసరం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఇప్పటికైనా ప్రజలు ప్రభుత్వ పాలకులు పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు విపక్షాలు ప్రతిపక్షాలు విప్లవ పోరాట పార్టీలు అర్హుల వైపు పోరాడితేనే ఇది సాధ్యమవుతుందని పలువురు భావిస్తున్నారు.

# ఐక్యమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

**పెంబి మండలంలోని పోచంపల్లిలో 30 లక్షలతో వ్యవసాయ గోదం నిర్మాణానికి భూమి పూజ చేసిన పటేల్ వెల్లడి**







**ఖానాపూర్ ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) :** ప్రజలంతా మమేకమై ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు పెంబి మండలం పోచంపల్లి గ్రామంలో 30 లక్షలతో వ్యవసాయ గోదాం నిర్మాణానికి భూమి మంగళవారం పూజ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గ్రామ ప్రజల సమస్యలుఅడిగి తెలుసుకున్నారు. స్థానిక అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు,పోచంపల్లి వాయపేట్ అంకేన చుట్టూ పక్కల గ్రామాలకు ఎదురవుతున్న రోడ్డు సమస్యను అన్ని గ్రామాల ప్రజల ఐక్యతతోనే సాధ్యం అని,వారం రోజుల లోపల బ్రిడ్జి నిర్మాణానికి 20 లక్షల మంజూరి ఇస్తాం అని హామీ ఇచ్చారు,అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాంఅన్నారు. అలాగే సెల్ టవర్ ఏర్పాటుకు అధికారుల ద్వారా నివేదికలు తీసుకొని చుట్టు పక్కల గ్రామాలకు నెట్వర్క్ వచ్చేలా సెంటర్ పాయింట్‌లో ఏర్పాటు చేస్తాం అని,అవసరమైన ల్యాండ్ గ్రామస్తులు,అధికారులతో కలిసి సేకరించాలని సూచించారు.గ్రామస్తులు ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెంబి మండల వివిధ శాఖల అధికారులు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందు గార్డెన్ దశాబ్ది ఉత్సవాలు

**- పది వసంతాల సేవలకు గుర్తుగా కేక్ కట్ చేసిన యజమాని బండి సదానందం యాదవ్**
**- తక్కువ ధరకు మెరుగైన సౌకర్యాలతో ప్రజలకు సేవలందించడమే లక్ష్యం**





**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 11, ప్రజాజ్యోతి :** మందమర్రి పట్టణం అందుగులపేట సమీపంలో ఉన్న ఇందు గార్డెన్ నిర్మాణం చేపట్టి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఇందు గార్డెన్లో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందు గార్డెన్ యజమాని బండి సదానందం యాదవ్ తన సహచరులు, మిత్రులు, శ్రేయోభిలాషులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుంటూ దశాబ్ది వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

ఈ సందర్భంగా బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ.. ఇందు గార్డెన్ నిర్మాణం చేపట్టి పదేళ్లు పూర్తిచేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత పది సంవత్సరాలుగా మందమర్రి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వివాహాలు, నిశ్చితార్థాలు, ఇతర శుభకార్యాలను నిర్వహించుకునేందుకు తక్కువ ధరలకు గార్డెన్ సౌకర్యాలను అందిస్తూ వస్తున్నామని తెలిపారు. తక్కువ ధరకే ఎక్కువ సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో ఇందు గార్డెన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను అందిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. మందమర్రి పట్టణ ప్రజలకు ఇందు గార్డెన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.గత పదేళ్లుగా ఇందు గార్డెన్ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు, తమపై నమ్మకంతో శుభకార్యాలను నిర్వహించుకున్న కుటుంబాలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణే ఇందు గార్డెన్ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులోనూ మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని బండి సదానందం యాదవ్ తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల్లో బండి సదానందం యాదవ్ సన్నిహితులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఇందు గార్డెన్ దశాబ్ది పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# రూ.20 లక్షల డిమాండ్.. రూ.1.30 లక్షలు చేతులు మారాయా?

**- జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారిపై ఆరోపణల కలకలం**
**- సమగ్ర విచారణకు సీపీఎం డిమాండ్.. నిజానిజాలు తేల్చాలని దుర్గం దినకర్**

**ఆసిఫాబాద్, ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జిల్లా వ్యవసాయ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారిని లక్ష్యంగా చేసుకుని రూ.20 లక్షలు డిమాండ్ చేసినట్లు వస్తున్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో రూ.1.30 లక్షలు అడ్వాన్స్‌గా చేతులు మారినట్లు ప్రచారం జరుగుతుండటంతో విషయం చర్చనీయాంశంగా మారింది.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఆరోపణల్లో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



**రూ.20 లక్షల వ్యవహారంపై ప్రశ్నలు :** జిల్లా స్థాయి అధికారిని ఉద్దేశించి ఇంత భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. ఆరోపణల వెనుక అసలు కథ ఏమిటన్నది బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరు డబ్బులు డిమాండ్ చేశారు? ఏ కారణంతో డిమాండ్ చేశారు? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అనే అంశాలపై విచారణ జరపాలని కోరారు.

**రూ.1.30 లక్షలు ఎవరి చేతికి? :** ఈ వ్యవహారంలో రూ.1.30 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోందని దినకర్ పేర్కొన్నారు. అయితే ఆ నగదు ఎవరి వద్దకు వెళ్లింది? ఎవరు తీసుకున్నారు? ఏ పని కోసం ఇచ్చారు? నగదు లావాదేవీకి సంబంధించిన ఆధారాలేమైనా ఉన్నాయా? అనే విషయాలను అధికారులు తేల్చాల్సి ఉందన్నారు. కేవలం ఆరోపణలు, ప్రచారంతో కాకుండా ఆధారాల ఆధారంగా విచారణ సాగాలని సూచించారు.

**అధికారుల మౌనం ఎందుకు? :**

జిల్లా స్థాయి అధికారిపై తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పష్టంగా స్పందించకపోవడంపై దినకర్ ప్రశ్నలు సంధించారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా వివరణ ఇవ్వాలని, వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి :**

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ నేరుగా దృష్టి సారించి సమగ్ర విచారణకు ఆదేశించాలని సీపీఎం కోరింది. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు, డబ్బు లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు, అందుబాటులో ఉన్న ఇతర సమాచారాన్ని పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేసింది. ఎలాంటి రాజకీయ, అధికార ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరగాలని పేర్కొంది.

**నిజమైతే కఠిన చర్యలు :**

విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని దినకర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో ఆరోపణలు నిరాధారమని తేలితే ఆ విషయాన్ని కూడా జిల్లా యంత్రాంగం ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఆధారాలు లేకుండా ఎవరిపైనా ముద్ర వేయడం సరికాదని, అయితే తీవ్రమైన ఆరోపణలను విస్మరించడం కూడా సమంజసం కాదని పేర్కొన్నారు.

**పారదర్శక విచారణే పరిష్కారం :** ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని దినకర్ అన్నారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో పారదర్శక విచారణ జరగాలని కోరారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను త్వరితగతిన వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులు ఎవరైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆందోళనకు సీపీఎం హెచ్చరిక :** వ్యవహారంపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దినకర్ హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారిపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

**ఆరోపణలు నిజమా? ప్రచారమేనా?** అన్నది అధికారిక విచారణతోనే తేలాల్సి ఉంది. అయితే రూ.20 లక్షల డిమాండ్, రూ.1.30 లక్షలు చేతులు మారినట్లు జరుగుతున్న ప్రచారంపై జిల్లా యంత్రాంగం స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న దర్శకుడు హరీష్ శంకర్



**బాసర, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలోని బాలాలయంలో సినీ దర్శకుడు హరీష్ శంకర్ మంగళవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు.

అమ్మవారి బాలాలయంలో ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో హరీష్ శంకర్‌కు ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అచ్యుత్ కుమార్, హరీష్, కళాదర్ శర్మ, వేద పండితులు నవీన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా పరిశీలన



**నేరడిగొండ, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుమారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల కార్యాలయ సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడేపు రవి, పంచాయతీ కార్యదర్శి దత్తహరి, కరోబార్ నందడెపు రాజుతో కలిసి గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించారు.ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు ఉన్న ప్రతి లబ్ధిదారుడి నివాస పరిస్థితులను అధికారులు స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం వారు రేకుల ఇళ్లలో, పెంకుటిళ్లలో, గుడిసెల్లో లేదా ఇతర నివాసాల్లో ఉంటున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకుని నమోదు చేశారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరామర్శ



**సోనాల, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :** సోనాల మండలం సంపత్ నాయక్ తండా (పార్డి బి) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాథోడ్ సాకారం అన్నా రాథోడ్ తుకారామ్ సతీమణి బిక్రిబాయి కొన్ని రోజుల క్రితం స్వర్గస్తులయ్యారు. ఈ రోజు అ విషయం తెలుసుకొని వారి స్వగృహానికి చేరుకొని మాజీ సర్పంచ్ సాకారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన టిఆర్ఎస్ స్టేట్ అబ్జర్వర్, బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఏమ్మెల్యే రాథోడ్ బాపురావు. వీరితో మండల కన్వీనర్ సదానందం మాజీ ఎంపీటీసీ రాయలు, సాగర్, ఇచ్చోడా మండల్ కన్వీనర్ బిలాల్ మహ్మద్, మారుతి పటేల్, రంజిత్, ఖాసీం షేక్ ఆలం, కుర్మే నారాయణ, ఖాలీమ్, ముండే వినోద్, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్ల దరఖాస్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో



**సోనాల, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :** సోనాల ? మండలశీ లోని సాకేర గ్రామంలో కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తుల కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రత్నాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, పరిశీలన ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారుడూ విడిపోకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, త్వరితగతిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ మోతి సింగ్, ఉప సర్పంచ్ రాథోడ్ భీమ్రావు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నీళ్లు ఉన్నాయన్న ఆశతో వరి వేయొద్దు!

- ఎల్‌నినో ప్రభావం పెరిగే అవకాశం.. ఆరుతడి, పామాయిల్ వైపు మళ్లాలి

- పెద్దమందడి రైతులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచన

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి): ప్రస్తుతం నీళ్లు వస్తున్నాయని తొందరపడి వరి సాగు చేసి.. తర్వాత నీటి కోసం ఇబ్బందులు పడొద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు సూచించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రెండు నెలల్లో ఇది మరింత పెరిగి వర్షాలు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. రైతులు ముందుచూపుతో ఆరుతడి, పామాయిల్, కూరగాయల పంటల వైపు మళ్లాలని సూచించారు. మంగళవారం పెద్దమందడి రైతువేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు నాటికి పెద్దమందడి మండలంలో 100 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదవగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 76 సెం.మీ. మాత్రమే నమోదైందన్నారు. గతేడాది 22 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. అందులో 18 వేల ఎకరాల్లో వరి సాగైందని తెలిపారు. ఈ ఏడాది వరికి సరిపడా నీరు అందే పరిస్థితి ఉండకపోవచ్చని, భూగర్భ జలాలు సైతం తగ్గుతున్నాయని హెచ్చరించారు.

**ఆరుతడితో ముందుకు..**

పెద్దమందడి రైతులు వేరుసెనగ, మినుములు, కూరగాయలు, పామాయిల్ వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకుని ఇతర మండలాలకు మార్గదర్శకంగా నిలవాలని కలెక్టర్ కోరారు. ఆరుతడి పంటలకు మేలురకం, లాభదాయకమైన విత్తనాలను అందించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.

**పామాయిల్‌కు భారీగా సబ్సిడీ**

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ పామాయిల్ సాగును ప్రభుత్వం భారీ సబ్సిడీతో ప్రోత్సహిస్తోందన్నారు. ఒక ఎకరా వరికి వినియోగించే నీటితో మూడు ఎకరాల్లో పామాయిల్ సాగు చేయవచ్చన్నారు. ఎకరానికి ఐదు నుంచి ఏడు టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే పామాయిల్ సాగు చేస్తున్న కొందరు రైతులు నెలకు లక్షల రూపాయల ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు. కూరగాయల సాగుకు ఎకరానికి రూ.9,600 వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు.

**వరికి బోనస్ ఇస్తే.. ఆరుతడికి ఎందుకు?**

రైతు వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఆరుతడి పంటలే ఎక్కువగా సాగు చేసేవారని, సాగునీటి విస్తరణతో రైతులు వరి సాగుకు అలవాటు పడ్డారని తెలిపారు. వరికి గిట్టుబాటు ధరతో పాటు ప్రభుత్వం బోనస్ ఇస్తున్న నేపథ్యంలో రైతులు ఇతర పంటల వైపు ఎందుకు మళ్లుతారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆరుతడి పంటలకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వడంతో పాటు వాటికీ బోనస్ అందించాలని కోరారు.

కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో పర్ణిత, మండల వ్యవసాయ అధికారి సైదులు, సర్పంచి సూర్యగంగమ్మ, సింగిల్ విండో చైర్మన్ సత్యారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు ప్రతిపాదిత స్థల పరిశీలన

- స్థల అనుకూలత, విస్తీర్ణం, సరిహద్దులపై ఆరా తీసిన రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్‌నగర్, ఆగస్టు 11( ప్రజా జ్యోతి బ్యూరో ): హన్వాడ మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం పరిశీలించారు. హన్వాడలోని 2బీహెచ్‌కే ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో



పాఠశాల ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని ఆమె పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు సేకరించారు.

హన్వాడ తహసీల్దార్, మండల సర్వేయర్‌తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ భూమికి సంబంధించిన రికార్డులు, విస్తీర్ణం, సరిహద్దులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందా? పాఠశాల నిర్మాణానికి అవసరమైన మేరకు భూమి అందుబాటులో ఉందా? అనే అంశాలపై అధికారులతో చర్చించారు.

ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పాఠశాల ఏర్పాటుకు అనుకూలతపై నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## జూరాల జలాలపై కీలక భేటీ

- నేడు వనపర్తిలో సాగునీటి సలహా మండలి సమావేశం

- ఐదు ఎత్తిపోతల పథకాలపై చర్చ

వనపర్తి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి): వనపర్తి జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సమావేశంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుతో పాటు జూరాలపై ఆధారపడిన రాజీవ్ భీమా, జవహర్‌లాల్ నెహ్రూ, కోయిల్‌సాగర్, శ్రీశైలం, మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించిన సాగునీటి అంశాలపై చర్చించనున్నారు.



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకానున్నారు. జూరాల ఆయకట్టు, ఎత్తిపోతల పథకాల నీటి లభ్యత, సాగునీటి అంశాలపై సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

## విధులకు గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

* ఆకస్మిక తనిఖీల్లో కార్యాలయాల్లో అందుబాటులో లేని వైనం

గద్వాల,ఆగస్టు 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే విధుల్లో ఉంటున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు.ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గద్వాల మండలంలోని ఈడిగోనిపల్లి గ్రామ పంచాయతీ,ధరూర్ మండలంలోని ఎల్కలోనిపల్లి గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేరని అధికారులు గుర్తించారు.ఈ విషయంపై గద్వాల,ధరూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను వివరణ కోరగా,సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైనట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం పట్ల జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.విధి నిర్వహణ సమయంలో పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

## పాము కాటుకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

- వైద్యులను ఆదేశించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, ఆగస్టు 11( ప్రజా జ్యోతి బ్యూరో ): పాము కాటుకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వైద్యులను ఆదేశించారు.దేవరకద్రలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి పాము కాటుకు గురై మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ మంగళవారం ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు అందుతున్న చికిత్స వివరాలను సమీక్షించారు. విద్యార్థి చికిత్సకు స్పందిస్తున్నాడని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థిని నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన అన్ని వైద్య సేవలను అందించాలని మధుసూదన్ నాయక్ సూచించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు.



## మాట ఇచ్చారు.. భోజనం వడ్డించారు!

- 'సర్'గా మారారు.. సంతోషం పంచారు!

- అంజనగిరి పాఠశాలలో విద్యార్థులతో మమేకమైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి..

- ఒత్తిడి తగ్గించి చదువుపై ఆసక్తి పెంచాలని సూచన

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి): విద్యార్థులతో మమేకమై.. వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. వనపర్తి మండలం అంజనగిరి గ్రామంలోని పాఠశాలలో 'సర్' కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించిన ఆయన.. పరిశుభ్రత, మంచినీరు, ఆహార నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా భోజనం ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మంగళవారం పాఠశాలకు వచ్చి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి, చదువుపై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పించి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శిస్తూ విద్యా వసతులు, మౌలిక సదుపాయాలు, ఆహార నాణ్యతపై దృష్టి సారించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి బాధ్యతగల పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.

**విద్యార్థులతో ఆప్యాయంగా..**

భోజనం అనంతరం విద్యార్థులతో నిరంజన్‌రెడ్డి ఆప్యాయంగా ముచ్చటించారు. మనకు ఆహారాన్ని అందించే రైతులు, రైతు కూలీల పాత్రను వివరించి.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు రైతులను కూడా గౌరవించాలని సూచించారు. విద్యార్థులకు చాక్లెట్లు, అరటిపండ్లు అందించి వారిని ఉత్సాహపరిచారు. మాజీ మంత్రి స్వయంగా భోజనం వడ్డించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, కె. మాణిక్యం, సర్పంచి నేనావత్ శాంతమ్మ దేవకుమార్, రఘువర్ధన్‌రెడ్డి, ధర్మానాయక్, రవిప్రకాష్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నరేష్, చిట్యాల రాము, ఉపసర్పంచి రాజు, ధర్మేందర్, యాదగిరి, వాసు, తిరుపతయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**డిజిటలైజేషన్‌లో ఉమ్మడి జిల్లాలో గద్వాలకు అగ్రస్థానం**

**87.31 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి**

గద్వాల,ఆగస్టు 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వే అనంతరం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌లో జోగులాంబ గద్వాల జిల్లా ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి సమర్పించిన ఓటర్ల వివరాల్లో ఇప్పటివరకు 87.31 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 63,925 అన్‌కలెక్టబుల్ ఫారాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు.ఓటర్ల పేర్లు,ఇంటిపేర్లు తదితర వివరాల్లో తప్పిదాలు ఉన్న అనామలీ ఓటర్లకు నోటీసులు జారీ చేసిన అనంతరం,కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల పత్రాల్లో ఏదైనా ఒక పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు.సంబంధిత అధికారుల పరిశీలన,ధ్రువీకరణ అనంతరం తప్పిదాలను సరిచేసి అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.



## మత్స్యకారులకు 5 లక్షల గ్రూప్ ప్రమాద బీమా

-జిల్లాలోని 12 వేల మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా ఒక వరం

-జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ ముదిరాజ్

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మత్స్యకారులకు కుటుంబ భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేయడం పట్ల నారాయణపేట జిల్లా మత్స్యకారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో నారాయణపేట జిల్లాలో 12,000 మంది మత్స్యకారులకు ప్రమాద గ్రూప్ భీమ అమలవుతుందని మత్స్యకారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రమాద బీమా పట్ల జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో 12,000 మంది జిల్లా మాత్స్యకారులు సభ్యత్వ నమోదు కలిగి ఉన్నారని వారందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రమాద బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం,జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు ప్రభుత్వం అమలు చేయడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. 2026-27 సంవత్సరంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1,34,79,673 చెల్లిస్తుందని తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5.00 లక్షలు,శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5.00 లక్షలు ,శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 వేల రూపాయలు ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందితే – గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం అందుతుందని ఈ యొక్క పథకం 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు,వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలక మైనదని పేర్కొన్నారు. ప్రమాద బీమా అమలు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రివర్యులు వాకిటి శ్రీహరితో పాటు నారాయణ పేట ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి నారాయణపేట మత్స్యకారుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ ముదిరాజ్ అన్నారు.






## మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి:పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య

* డాక్టర్ కనికే ప్రియాంకకు ఘన నివాళి

గద్వాల ఆగస్టు 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో మృతి చెందిన మెడికో విద్యార్థిని డాక్టర్ కనికే ప్రియాంకకు మెడికల్ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి,రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో శంకర ప్రభాకర్ (టీపీఎఫ్),పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య మాట్లాడుతూ,డాక్టర్ కనికే ప్రియాంక మృతి తీవ్ర విషాదాన్ని కలిగించిందన్నారు.ఉజ్వల భవిష్యత్తు ఉన్న మెడికల్ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి,వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.డాక్టర్ ప్రియాంక మృతికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమైన వారిని గుర్తించి,ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.నేరం రుజువైన వారిపై చట్టపరమైన కఠిన శిక్షలు విధించాలని,బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.మెడికల్ కళాశాలలు,హాస్టళ్లలో విద్యార్థినుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టళ్లలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.డాక్టర్ కనికే ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు విద్యార్థులు ఐక్యంగా పోరాడుతారని తెలిపారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్,నాగన్న,మణికంఠ,రాజశేఖర్ గుజ్జురాల్,విజయ్, భరత్, సాయికుమార్‌తో పాటు పలువురు మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.



## క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత వాటిల్లుతుంది

- యువజన సంఘ కమిటీలకు క్రికెట్ కిట్ల పంపిణీ
- ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**గాయపర్తి ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కోలన్ పల్లి గ్రామంలో స్థానిక యూత్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు, మంగళవారం (9 ) యూత్ కమిటీ సభ్యులకు రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ల ను పంపిణి చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి .ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ,జినుగు అనిమి రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, మచ్చ శ్రవణ్ పెండోట శివ, ఐత జంపి, గారే నరేష్, పీరని రాజుస్థానిక పార్టీ ముఖ్య నాయకులు వంగళ నర్సయ్య, తిరుమల రంగా చార్యులు, తిరుమల అయ్య వెంకట చార్యులు,, చిట్యాల వెంకన్న, తోట నర్సింగం, తోట యోగానందు మాచర్ల సోమనారాయణ మునిగాల భాస్కర్ గడ్డల సంతోష్ గడ్డల రాజకుమార్ పనికర నాగరాజు సముద్రాల శ్రీకాంత్ మిట్టపెల్లి రాజు కాడ బోయిన మల్లేష్.లి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన సర్పంచ్ తోట భద్రయ్య



**వెంకటాపూర్/ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్(ప్రజా జ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని కేశవాపూర్ గ్రామంలో ఉన్న నీటిసమస్య తీర్చే దిశగా పంచాయతీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క రూ.50 లక్షల రూపాయలతో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ మంజూరు చేశారు.అందుకు ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం మంత్రి సీతక్క చిత్రపటానికి గ్రామ సర్పంచ్ తోట భద్రయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేసి మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ తోట భద్రయ్య తోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శ్యామ్ సుందర్ రెడ్డి,మాజీ జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల రాంబాబు,కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కబీర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

- శనివారం నాటికి ఆరోగ్య కేంద్రానికి నీటి సరఫరా అందుబాటులోకి తేవాలి - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా





**రఘునాథపల్లి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :** రోగులకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు. మంగళవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ముందుగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్ (ఐపీ ) వార్డును పరిశీలించిన కలెక్టర్ ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విధులకు హాజరైన సిబ్బంది వివరాలతో పాటు గైర్హాజరైన సిబ్బంది వివరాల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు అందించే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రం పరిసరాలు, వార్డులు, రోగులు వేచి ఉండే ప్రదేశాలు, ఇతర గదుల్లోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైన అంశమని, రోగులకు చికిత్స అందించే ప్రదేశం అన్ని వేళలా శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఆరోగ్య కేంద్రం ఆవరణతో పాటు అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని, ఎక్కడా చెత్త, దుమ్ము, అపరిశుభ్రత కనిపించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం టీకాల గది, ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీలను కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, రోగులకు టెస్ట్ రిపోర్టులు అందజేస్తున్న విధానం గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పూర్తయిన అనంతరం రోగులకు రిపోర్టులు నిర్ణీత సమయంలో అందేలా చూడాలని సూచించారు. ఫార్మసీలో మందుల నిల్వలు, అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలను తనిఖీ చేశారు. మందుల వినియోగంలో ఫిఫో (ఫస్ట్ ఇన్ -- ఫస్ట్ అవుట్) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని, ముందుగా వచ్చిన మందులను ముందుగా వినియోగించేలా స్టాక్ నిర్వహణ చేయాలని ఆదేశించారు. గడువు తేదీలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, మందుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రంలో నీటి సరఫరా పరిస్థితిని కలెక్టర్ పరిశీలించి, ప్రస్తుతం ఉన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో అవసరమైన నీటి సరఫరా శనివారం నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆరోగ్య కేంద్రం ప్రాంగణం, నీటి నిల్వ ప్రదేశాలు, టాయిలెట్లు, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, తదితర అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, మందుల లభ్యత, నీటి సరఫరా వంటి అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది, సర్పంచి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గడ్డం హరీష్‌ను పరామర్శించి 4 వేల రూపాయాలు ఆర్థిక సహాయం

### ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం గన్నరం గ్రామంలో మంగళవారం.స్థానిక సర్పంచ్ గడ్డం విజయ సమ్మయ్య కుమారుడు గడ్డం హరీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, హాస్పిటల్ లో చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా వారిని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ తరపున 4000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేసినఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా. నాయకులుపరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఎల్లవేళలా పనిచేస్తుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్,



సంకినేని ఎల్లస్వామి, మచ్చ శ్రవణ్, పెండోట శివ, ఐత జంపి, గారే నరేష్, పీరని రాజు స్థానిక సర్పంచ్ గడ్డం విజయ సమ్మయ్య, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఊళ్లేంగల సుధాకర్, పార్టీ ముఖ్య నాయకులు గజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బొంధ్యలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. అండగా నిలుస్తాం!

- మిత్రురాలి తండ్రి మృతికి పరామర్శ..
- క్వింటా బియ్యం అందజేత



**శాయంపేట, ఆగస్టు 11, (ప్రజా జ్యోతి):** తోటి మిత్రులకు ఆపద వచ్చినప్పుడు 'మేమున్నాం' అంటూ అండగా నిలుస్తున్నారు పెద్దకొడపాక పాఠశాలలో 1996--97లో చదువుకున్న విద్యార్థులు. గత 20 ఏళ్లుగా తమతో చదువుకున్న మిత్రులు ఎవరైనా ఆపదలో ఉంటే తమవంతు సహాయ సహకారాలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా తమ తోటి మిత్రురాలు ఏదుల శ్రీలత తండ్రి ఇటీవల అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబాన్ని మిత్రులంతా పరామర్శించారు. శ్రీలతను ఓదార్చి, కుటుంబానికి అండగా నిలిచారు. తమ వంతు సహాయంగా ఒక క్వింటా బియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. పాఠశాలలో కలిసి చదువుకున్న తమ మిత్రులందరికీ ఆపద సమయంలో అండగా నిలుస్తూ, ఒకరికి ఒకరం సహాయ సహకారాలు అందించుకుంటున్నామని తెలిపారు. మిత్రుల ఐక్యతను, సేవా భావాన్ని గ్రామస్తులు అభినందించారు.

## మైలారం గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

### మోకాలి శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నరసయ్యకు పరామర్శ



**రాయపర్తి ఆగస్టు 11 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉళ్లేంగుల నర్సయ్య ను పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి మంగళవారం పరామర్శించారు. మోకాలి శస్త్రచికిత్స అనంతరం మైలారం గ్రామంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న నర్సయ్య ను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నర్సయ్య త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11, (ప్రజా జ్యోతి) :** రాజ్యాంగం కల్పించిన హక్కులతోపాటు పౌరులుగా తమ బాధ్యతలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. హక్కుల కోసం పోరాడటం నాణేనికి ఒకవైపు మాత్రమేనని, మరోవైపు తమ బాధ్యతలను గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు.





హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహిస్తున్న రెండు రోజుల సమగ్ర సమాచార, అవగాహన కార్యక్రమం (ఐసీవోపీ), ఫొటో ఎగ్జిబిషన్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ప్రారంభించారు. జాతీయ పతాక ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరించే ఛాయాచిత్రాలను వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్‌కుమార్ బోడా వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, సమరయోధుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం, గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మన అదృష్టమన్నారు. ప్రాథమిక హక్కులతోపాటు ప్రాథమిక విధులు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. జాతీయ పతాకం ఒక్కరోజులో రూపుదిద్దుకోలేదని, దాని వెనుక ఎన్నో ఏళ్ల పోరాటం, త్యాగం ఉందన్నారు. స్వేచ్ఛను కాపాడటంతోపాటు భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, దేశం పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాబృందాలు ప్రదర్శించిన 'హర్ ఘర్ తిరంగా' యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్, కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీలత, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతన్నలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మైలారం సబ్‌స్టేషన్‌లో నూతనంగా టౌన్ ఫీడర్ ప్రారంభం
- పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**రాయపర్తి ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా: రాయపర్తి మండలం మైలారం గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగు పరిచే దిశగా మరో ముందడుగు పడింది.మైలారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టౌన్ ఫీడర్‌ను 9 లక్షలు రూపాయల ఖర్చుతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు.

రిబ్బన్ కట్ చేసి టౌన్ ఫీడర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేకు విద్యుత్ శాఖ డిఈ, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టౌన్ ఫీడర్ అందుబాటులోకి రావడంతో మైలారం గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు, అంతరాయాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.మైలారం గ్రామ



ప్రజల విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించేలా టౌన్ ఫీడర్‌ను అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మైలారం గ్రామంలో నూతన టౌన్ ఫీడర్ ప్రారంభంతో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు హమ్య నాయక్, కరెంట్ అధికారులు డిఈ, ఏఈ, సబ్ ఇంజనీర్, లైన్మెన్, నాయకులు అధికారులు రైతులు ప్రజలు వ్యక్తులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పీవీ కవచం

- కేజీబీవీలో 14 మంది బాలికలకు టీకాలు
- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణపై అవగాహన
- చిన్న వయసులోనే వ్యాధి నిరోధక చర్యలకు ప్రాధాన్యం
- తల్లిదండ్రులు టీకాపై అవగాహన పెంచుకోవాలని వైద్యుల సూచన





**భీమదేవరపల్లి ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 14--15 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన 14 మంది బాలికలకు వైద్య సిబ్బంది టీకాలు అందించారు. టీకాతో పాటు హెచ్‌పీవీ వైరస్, దాని ప్రభావాలు, వ్యాధి నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

**ముందస్తు రక్షణకు ప్రాధాన్యం :** హెచ్‌పీవీ అనేది మనుషుల్లో సంక్రమించే వైరస్. కొన్ని రకాల హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్లు భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు కారణమయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు వివరించారు. ఈ నేపథ్యంలో వైరస్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను నివారించేందుకు టీకా కార్యక్రమాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అర్హత ఉన్న వయసులోనే బాలికలకు టీకా అందించడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. టీకా తీసుకోవడంపై బాలికలకు అవసరమైన వివరాలను తెలియజేసి, తల్లిదండ్రుల సహకారం ప్రాధాన్యాన్ని వివరించారు.

**అపోహలకు దూరంగా..:** కొన్ని సందర్భాల్లో టీకాలపై సరైన సమాచారం లేకపోవడం వల్ల తల్లిదండ్రుల్లో సందేహాలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన ఏ టీకా అయినా సంబంధిత వైద్యుల సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తీసుకోవాలని తెలిపారు. హెచ్‌పీవీ టీకా ఒక్కటే భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి పూర్తిస్థాయి రక్షణకు హామీ కాదని, నిర్ణీత వయసులో టీకాతో పాటు భవిష్యత్తులో వైద్యుల సూచన మేరకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు, అవగాహన కూడా ముఖ్యమని వివరించారు. నివారణ చర్యలను చిన్న వయసు నుంచే అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేసుకోవచ్చని పేర్కొన్నారు.

**తల్లిదండ్రుల పాత్ర కీలకం :** బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్య సిబ్బంది సూచించారు. అర్హత ఉన్న బాలికలకు హెచ్‌పీవీ టీకా అందేలా చూడటంతో పాటు ఆరోగ్య సమస్యలపై పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం కల్పించాలని కోరారు. పాఠశాలలు, వైద్యశాఖ, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తే బాలికల్లో ఆరోగ్య అవగాహన మరింత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రహమాన్, నర్సింగ్ అధికారులు కవిత, శౌర్య, సూపర్‌వైజర్ మోహన్, ఏఎన్‌ఎంలు లక్ష్మి, స్వరూప, పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఏఎన్‌ఎం కోమల, ఆశా కార్యకర్త పాల్గొన్నారు. విద్యార్థినులకు టీకాలు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ, వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

**డాక్టర్ రుబీనా :** హెచ్‌పీవీ వైరస్ నుంచి రక్షణ పొందడంలో టీకా కీలకమైన ముందస్తు రక్షణ చర్యగా ఉపయోగపడుతుందని డాక్టర్ రుబీనా తెలిపారు. అర్హత ఉన్న బాలికలకు నిర్ణీత వయసులో టీకా అందించడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు తోడ్పడుతుందని చెప్పారు. తల్లిదండ్రులు టీకాపై సరైన అవగాహన కలిగి, అర్హత ఉన్న బాలికలకు టీకా అందేలా చూడాలని సూచించారు



# మునగ కోటయ్య మృతదేహానికి దైద రవీందర్ నివాళి

కేతేపల్లి ఆగస్టు 11 . ప్రజా జ్యోతి :
కేతేపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు, నమస్తే తెలంగాణ రిపోర్టర్ మునగ లింగమల్లు తండ్రి మునగ కోటయ్య మృతి చెందారు.




విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ కోటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, కేతేపల్లి మాజీ ఎంపీపీ జటంగి వెంకట నరసింహ యాదవ్, సైదులు యాదవ్, నరేష్, ప్రవీణ్, మహేష్, నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళి కాబద్ధంగా ముందుకు సాగాలి

నకిరేకల్ ఆగస్టు 11 ప్రజా జ్యోతి:
గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ



పంచాయతీల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు తదితర ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందించేందుకు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు.

# అనారోగ్యంతో మృతి చెందిన మునగ కోటయ్యకు ఎమ్మెల్యే వేముల వీరేశం నివాళులు

కేతేపల్లి ఆగస్టు 11 ప్రజా జ్యోతి:
మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మునగ కోటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారి



మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పూన్న కైలాస్ నేత, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాల ధరల పెంపు.. సామాన్యుడి పాలిట భారమే!

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):
నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలపై పాల ధరల పెంపు మరింత భారాన్ని మోపుతోంది. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పాల సెంటర్లలో ఆవు, గేదె పాలు లీటర్‌కు రూ.90గా విక్రయిస్తున్నట్లు ప్రకటించడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కుటుంబంలో చిన్నారులు, వృద్ధులు సహా ప్రతిరోజూ పాలు వినియోగించడం అనివార్యంగా మారింది. లీటర్‌కు రూ.90 చెల్లించాల్సి రావడంతో నెలవారీ పాల ఖర్చు గణనీయంగా పెరుగుతోందని పేద, మధ్యతరగతి కుటుంబాలు వాపోతున్నాయి. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర సరుకులు, వంటగ్యాస్ తదితర ధరల పెరుగుదలతో సతమత మవుతున్న తమపై పాల ధరల పెంపు అదనపు భారంగా మారిందని పేర్కొంటున్నారు. పాల ధరల పెంపు ప్రభావం టీ, కాఫీ వంటి పానీయాలపై కూడా పడే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# మాజీ ఉపసర్పంచ్ భాషబోయిన వెంకన్న దాతృత్వం

**ఓనమాలు నేర్పిన పాఠశాలకు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చేయూత**

**వెంపటి ప్రాథమిక పాఠశాలకు డ్రమ్ములు అందజేసిన వెంకన్న**

**సేవ చేయడం గొప్ప బాధ్యత అంటున్న వెంపటి గ్రామస్తులు**

తుంగతుర్తి, ఆగస్టు 11(ప్రజాజ్యోతి):
తాను చిన్ననాటి ఓనమాలు నేర్చిన పాఠశాలపై ఉన్న మమకారాన్ని చాటుకుంటూ వెంపటి గ్రామ మాజీ ఉపసర్పంచ్ భాష బోయిన వెంకన్న తనవంతు సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలకు తన తన తల్లిదండ్రులైన భాష బోయిన అంజయ్య – ఉప్పలమ్మ ల జ్ఞాపకార్థం డ్రమ్ము లను గ్రామస్తుల చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు బివనపల్లి శ్రీనివాస్ కు అందజేశారు. వెంకన్న వెంపటి ప్రాథమిక పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని, అనంతరం ప్రజాజీవితం లోకి అడుగుపెట్టి గ్రామ మాజీ



ఉపసర్పంచ్‌గా రాజకీయ నాయకునిగా ఎదిగారు. తాను ఎదగ దానికి పునాది వేసిన పాఠశాలను, అక్కడి ఉపాధ్యాయులు అందించిన విద్యా బోధనను ఎప్పటికీ మరువకుండా పాఠశాల అవసరాలకు తనవంతు సహకారం అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకాలను కేవలం ఇంటికే పరిమితం చేయకుండా, విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమంగా మలచడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పాఠశాలలో జరిగే ప్రార్థనా కార్యక్రమాలు, జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యా కార్యక్రమాల్లో విద్యార్థులకు డ్రమ్ములు ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ...సమాజంపై బాధ్యత తాను చదువుకున్న పాఠశాలకు తిరిగి ఏదైనా చేయాలనే ఆలోచనతోనే ఈ సహాయం చేసినట్లు తెలిపారు. నా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందించడం ద్వారా వారి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తు లోనూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. తాను చదువుకున్న బడికి తిరిగి ఏదైనా ఇవ్వగలగడం ప్రతి పూర్వ విద్యార్థికి గర్వకారణం" అని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి పాఠశాలలకు సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు మరింత మంది ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాలకు డ్రమ్ములను అందించిన భాష బోయిన వెంకన్నను ఉపాధ్యాయులు,y విద్యార్థులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దాసరి మంజుల రామచంద్రు, వార్డు సభ్యుడు పులిగుజ్జ నరసయ్య,మాజీ సర్పంచ్ అబ్బగాని సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మాదరబోయిన రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదగాని రాజయ్య, సగ్గం నరసయ్య, చంటి వెంకన్న,బోళ్ల నరసయ్య, చిర్ర దిలీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గొట్టిపర్తిని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

**ప్రాంతీయ అభివృద్ధికి మండల కేంద్రం ఎంతో కీలకం.. బహుజన ప్రజా సమితి డిమాండ్**

తుంగతుర్తి, ఆగస్టు 11,(ప్రజా జ్యోతి):
గొట్టిపర్తిని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని బహుజన ప్రజా సమితి (బీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గొట్టిపర్తి నూతన మండల కేంద్రం ఏర్పాటు సాధన కమిటీ



ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు బీపీఎస్ అధ్యక్షుడు అడ్వకేట్ చింతకుంట్ల హరిబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గొట్టిపర్తి మండల కేంద్రంగా ఏర్పాటైతే పరిసర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. జలాల్ పురం, రావులపల్లి తండా, రాఘవపురం, రావులపల్లి, గొట్టిపర్తి, మామిడాల, మానాపురం తండ తదితర గ్రామాల ప్రజలకు పరిపాలనా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన మండల కేంద్రం ఏర్పాటుతో మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, ఆసుపత్రి, విద్యాసంస్థలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అదేవిధంగా వారాంతపు అంగడి ఏర్పాటుతో పాటు కొత్త దుకాణాలు, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కొత్త రహదారుల నిర్మాణంతో ప్రాంతీయ అభివృద్ధి వేగవంతమవుతుందని, భూముల విలువ పెరగడంతో పాటు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, ఇతర నిత్యావసరాలు స్థానికంగానే లభించే అవకాశం ఉంటుందని అన్నారు.గొట్టిపర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం కేవలం పరిపాలనా సౌకర్యం మాత్రమే కాదు.. చుట్టుపక్కల గ్రామాల సమగ్ర అభివృద్ధికి బాటలు వేసే నిర్ణయం అని బహుజన ప్రజా సమితి నాయకులు పేర్కొన్నారు. గొట్టిపర్తి నూతన మండల కేంద్రం ఏర్పాటు సాధన కమిటీ ఆధ్వర్యంలో నేడు(బుధవారం) గొట్టిపర్తి గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు, యువత, రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చింతకుంట్ల నాగేష్, పరమేష్, తడకమల్ల యాకయ్య, అవిలయ్య, సురేష్, అశోక్, బన్నీ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాలల హక్కుల పోరాట అమర వీరులకు ఘనంగా నివాళులు

మిర్యాలగూడ, ఆగస్టు 11,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ పట్టణంలోని ఎస్సి ఉద్యోగుల సంక్షేమ భవన్ లో మంగళవారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి వి రావు సహా మాలల హక్కుల కోసం పోరాటం చేసి అసువులు బాసిన మాల అమరవీరులకు మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి హాజరై మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొని అసువులు బాసిన అమరవీరులు గోపతోటి నారాయణ, పానంగి శేషయ్య,రెడ్డిసత్యనారాయణ,సుదర్శన్ ఉద్యమంలో అసువులు బాసినారని వారికి హృదయ పూర్వక నివాళులర్పిస్తూ, వాళ్ల ఆశయాలు కొనసాగిస్తా మన్నారు.ఎస్సి వర్గీకరణ అడ్డుకొని రోస్టర్ విధానంలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రతి ఒక్కరూ గొంతెత్తి ప్రశ్నించాలని,వర్గీకరణ ను అడ్డుకొని తీరాలన్నారు. మాలల హక్కుల కోసం రాజకీయాల కతీతంగా అందరూ ఏకం కావాలని అప్పుడే మాలల హక్కుల కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలకు ఫలితం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్,మాల మానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, మాల మహానాడు రాష్ట్ర కమిటీ మెంబర్ చిలుకూరి అభినవ్, మిర్యాలగూడ టౌన్ అధ్యక్షుడు మర్రి జోజి కుమార్,సామ కోటయ్య, పెరుమళ్ళ జీవన్ కుమార్ తదితరులుపా ల్గొన్నారు.

# నకిరేకల్‌లో ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం ప్రారంభం

నకిరేకల్: ఆగస్టు 11 ప్రజా జ్యోతి:
నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు, ఆపరేషన్ అనంతరం ఉచితంగా కంటి అద్దాలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నాలుగు రోజుల పాటు ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు



ఎమ్మెల్యే వెల్లడించారు. గత ఏడాది సుమారు 1,000 మందికి కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన కంటి చూపును అందించడమే లక్ష్యంగా ఈ సేవలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ప్రజలు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత, మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల–మాధవ్ రెడ్డి, PACS చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, పుష్పగిరి ఆసుపత్రి డాక్టర్ రాజేష్ మరియు వైద్య బృందం, మండల పార్టీ అధ్యక్షులు గాదగోని కొండయ్య, టౌన్ అధ్యక్షులు లింగాల వెంకన్న, ప్రజాప్ర తినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎంఎల్ఎఫ్ జనరల్ సెక్రటరీగా సుక్క శ్రవణ్ కుమార్ ఎన్నిక

రామన్నపేట, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఎం ఎల్ ఎఫ్ జనరల్ సెక్రటరీగా రామన్నపేటకు చెందిన న్యాయవాది ఏ జి పి సుక్క శ్రవణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.బలహీన వర్గాల న్యాయవాదుల హక్కులు, జూనియర్ న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని శ్రవణ్ కుమార్ తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎం ఎల్ ఎఫ్ ఆశయాలతో పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామన్నపేట ఎం ఎల్ ఎఫ్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు ఆయనను అభినందించారు.



# కష్టపడి చదివి కలలను సాకారం చేసుకోండి

**కేజీబీవీ విద్యార్థులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచన**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాజ్యోతి):
కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యార్థులకు సూచించారు.మంగళ



వారం ఆత్మకూరు(ఎస్) కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని తరగతి గదులు,వంటగది,వసతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి విద్యాభ్యాసం,భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దయ్యాక ఏమవుతారని ప్రశ్నించగా పలువురు విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ అవుతామని ఉత్సాహంగా సమాధానమిచ్చారు.వారి ఆత్మవిశ్వాసాన్ని అభినందించిన కలెక్టర్.. "సొంత కాళ్లపై నిలబడేందుకు చదువే ముఖ్యమైన మార్గం.కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి" అని సూచించారు.ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ,భోజనం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు.భోజనం నాణ్యతగా ఉందని,ఇదే ప్రమాణాలను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యం,భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విశాల్,తహసీల్దార్ అమిన్ సింగ్,ప్రిన్సిపాల్ వై.సరస్వతి, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రపాల నగరం విద్యా ఆగ్రో రైస్మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

రామన్నపేట ఆగస్టు 11 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం లోని విద్యా ఆగ్రో రైస్ మిల్లులో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి విజిలెన్స్ బృందం సభ్యులు తనిఖీలు చేపడుతున్నారు. రైస్ మిల్లులో



నిల్వ ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించారు. కొనుగోలు చేసిన ఎగుమతి, దిగుమతి ధాన్యం రికార్డులను పరిశీలిస్తున్నారు.కోట్ల రూపాయల సీఎంఆర్ బియ్యం పక్కదారి పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. 2023 నుంచి మిల్లు పేరు మార్చి సీఎంఆర్లో అక్రమాల ఆరోపణలపై ఆరా, మూడేళ్ల రికార్డులు, నిల్వలతో పాటు అప్పటి అధికారుల పాత్రపైనా పరిశీలిస్తున్నట్లు సమాచారం. తనిఖీలు రాత్రి కూడ కొనసాగుతాయని పూర్తి అయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని వారు తెలిపారు. ఈతనిఖీల్లో ఈటీఎఫ్ ఓఎసీ ఆంజయ్య, డీఎం హరికృష్ణ, డీఎస్ఓ రోజరాణి, డీటీ బాలమణి లు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో ఘనంగా తిరంగా జెండా ర్యాలీ





**ఎడపల్లి, ఆగస్టు 11(ప్రజాజ్యోతి):** దేశభక్తి నినాదాలతో ఎడపల్లి మండల కేంద్రం మార్మోగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకుల పిలుపు మేరకు మంగళవారం ఎడపల్లిలో తిరంగా అభియాన్‌లో భాగంగా భారీ జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, తిరంగా అభియాన్ జిల్లా కన్వీనర్ కందగట్ల రాంచందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ మంగల్పాడ్ చౌరస్తా వరకు సాగింది. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా జాతీయ జెండాలను చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డి మోహన్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి కూరెళ్ల శ్రీధర్, జిల్లా నాయకులు మల్లెపూల శ్రీనివాస్, యువ మోర్చా అధ్యక్షుడు మోస్రా సాయి కుమార్, వార్డు సభ్యులు దండి శంకర్, విఠల్, అరుణ్, మండల ప్రధాన కార్యదర్శి సాయి వేణు, బూత్ అధ్యక్షులు కంజరి ప్రదీప్ కుమార్, కట్కాం సుధాకర్, చింతల శేఖర్, మీసాల రాఘవేందర్, ఒడ్డపల్లి శ్రీను, శ్రీధర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు కేసరి శంకర్ గౌడ్, వెంకటేష్, గెంటె నిశాంత్, ద్యాకం సాయిరెడ్డి, కట్కాం శంకర్, పెరుగు రాజు, అనిరుద్ గౌడ్, మార సాయి, కంజరి అభినవ్, చైతన్, నరేందర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందల్వాయి ట్రైబల్ వెల్ఫేర్
# హాస్టల్‌లో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు. 11** ఇందల్వాయి: మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు రామావత్ మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల కిషన్, బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు తుకారం నాయక్.సదర్ నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అనంతరం మోహన్ నాయక్ మాట్లాడుతూబంజారా సమాజంలో తీజ్ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని నిర్వాహకులు తెలిపారు. బంజారా జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ఆడపడుచులు, చిన్నారులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీజ్ పండుగ వేడుకలను జరుపుకున్నారు. జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ తమపై ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా తీజ్ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షులు అనిల్ నాయక్. ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్. సోమ్లా నాయక్ విట్టల్ నాయక్ మండల నాయకులు పాల్గొన్నారు

# సీపీఐ జెండా ఆవిష్కరణ




**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజా జ్యోతి)** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రామారెడ్డి మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గర సిపిఐ జెండావిష్కరణ నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆవిష్కరించడం జరిగింది.

**అనంతరం మాట్లాడుతూ...!**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 9 నుండి 14 వరకు కామారెడ్డి జిల్లాలో పాదయాత్ర లు నిర్వహిస్తున్నామని అన్నారు అదేవిధంగా. కేంద్ర ప్రభుత్వము ధరలను పెరుగుదలను తక్షణ మే అరికట్టాలని. పంటలకు




కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి లని మరియు ప్రతి యువకులకు ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని కార్మిక హక్కులను పరిరక్షించాలని. అదేవిధంగా నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్, పెరిగిన ధరలను తగ్గించాలని,రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎరువుల ధరలు తగ్గించాలని,స్వామినాథ సిఫార్సులు అమలు చేయాలని, అన్నారు. ఈనెల 14 వరకు దేశవ్యాప్త రాజకీయ ప్రచార --పాదయాత్రల కు సిపిఐ పిలుపునిచ్చింది. ఈ పాదయాత్ర లు 2026 సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో రామ్ లీలా మైదానంలో జరగబోవు బహిరంగ సభ ర్యాలీ తో నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రజల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగు పాదయాత్రలను సెప్టెంబర్ ఒకటి మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ రామారెడ్డి మండల కేంద్రంలో భారీ ర్యాలీ. అనంతరం రాజమ్మ తండాలో రైతులతో సదస్సు నిర్వహించడం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. బాల్ రాజ్. నాయకులు. ఎస్ డి. హైదర్, రాజమణి, దేవయ్య, ప్రవీణ్, రఫీ క్. శ్రీనివాస్. మౌలాన్ బి. శుక్రు. రాజ్ మహమ్మద్. శ్యామల. లక్ష్మి. శివప్రసాద్, సంపత్ కుమార్, కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు

● మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్



**ఎల్లారెడ్డి, ఆగస్టు 11(ప్రజా జ్యోతి)** ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యామని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 1, 7 మరియు 12వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారుల స్థలాల్లో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్మన్ మత్తమాల భాగ్యవతి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ సూచనలతో పూరి గుడిసెల్లో నివసిస్తున్న అత్యంత నిరుపేద కుటుంబాలకు ఇళు నిర్మించే పనులను వేగవంతం చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు నాణ్యతతో, త్వరగా ఇళు పూర్తి చేసుకోవాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు భద్రతతో కూడిన సొంత గృహాలు లభించడంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుపతి, రఫీక్, విద్యాసాగర్, గఫార్, సిద్ది శ్రీధర్, చంద్రయ్య, శంకర్, దశరథ్, లక్ష్మీ శివానంద్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు స్థానికులు పాల్గొన్నారు.

## బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా
# ఎంపికపై అనిల్ నాయక్ కృతజ్ఞతలు



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) ఆగస్టు. 11** ఇందల్వాయి: మండల కేంద్రంలోని బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు మండల అధ్యక్షుడు తుకారాం నాయక్‌కు అనిల్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బంజారా సేవా సంఘం సభ్యులందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ తనపై సంఘం సభ్యులు ఉంచిన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయనని అన్నారు. బంజారా సేవా సంఘం అభివృద్ధికి, బంజారా సమాజ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.సంఘం నాయకులు, సభ్యుల సహకారంతో అందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ బంజారా సమాజ అభ్యున్నతికి కృషి చేస్తానని అనిల్ నాయక్ పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో
# తాగి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) ఆగస్టు. 11** ఇందల్వాయి మండల కేంద్రంలోని వారం రోజుల క్రితం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన1) ముకేశ్ గాల్లె సన్నాఫ్ ముచ్చట మన్మథ , వయస్సు:28 సంవత్సరాలు, వృత్తి : ఆటో డ్రైవర్ ముక్కాడు నాందేడ్ టిక్ యు. ఎన్ పి నాందేవ్ వాడ, నిజామాబాద్.అతనిని ఈరోజు కోర్టులో హాజరుపరచగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ( స్పెషల్ ఎక్సైజ్ కోర్ట్) న్యాయమూర్తి బాలరాజు నిజామాబాద్ గారు 7 రోజులు జైలు శిక్ష విధించడం జరిగింది.తాగి వాహనాన్ని నడపడం చట్టరీత్యా నేరం కావున తాగి వాహనాలు నడపకండి. అని ఇందల్వాయి ఎస్సై బి.సుమలత. తెలిపారు.



# సిరిపురలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన గురు శిష్యులు



**హత్నూర 11ఆగష్టు (ప్రజాజ్యోతి)** మండల పరిధిలో ని సిరిపురం గ్రామానికి చెందిన మహేష్ గౌడ్, గ్రాండ్ మాస్టర్ పోచయ్య గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించారు. హైదరాబాద్ పట్టణంలో గల గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఇటీవల లండన్ దేశానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించారు. గతంలో ఇంగ్లాండ్ దేశంలో ఒకేసారి 600 మంది సాధించిన రికార్డును అధిగమించి హైదరాబాద్ పట్టణంలోనీ గచ్చిబౌలి స్టేడియం లో నిర్వహించిన కటా పోటీల్లో దేశంలో అన్ని రాష్ట్రాల మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు సుమారు 2000 మంది ఒకేసారి ప్రదర్శించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్ మహేష్ గౌడ్ లను గ్రామ మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, నాయకులు వెంకట్ రెడ్డి పాండు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మొట్టమొదటిసారిగా గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం అభినందనీయమన్నారు. ఇలాంటి విజయాలు ఎన్నో సాధించి నియోజకవర్గానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.

# చట్టసభల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ తప్పనిసరి

● డీలిమిటేషన్ బిల్లులో దివ్యాంగులకు న్యాయం చేయాలి

● ముత్యం బస్వరాజ్ పాటిల్, నాపర్డ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



**కల్హేర్, ఆగస్టు 11:. ప్రజా జ్యోతి** ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును ప్రవేశపెట్టనున్నందున, దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (నాపర్డ్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముత్యం బస్వరాజ్ పాటిల్ ప్రభుత్వాన్ని కోరారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయినా, సమాజంలోని అట్టడుగు వర్గాల్లో ఒకటైన దివ్యాంగుల పట్ల పాలకులు ఇప్పటికీ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించడం ద్వారా వారికి ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కులను సాధించుకునే అవకాశం కల్పించాలని కోరారు.భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ప్రధాన సూత్రాలపై నిర్మితమైందని పేర్కొన్నారు. సమానత్వం అంటే కులం, మతం, ప్రాంతం, వర్గం వంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సమానంగా జీవించడంతో పాటు, చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం పొందడమేనని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో సమానత్వం, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న పాలకులు దివ్యాంగుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని ముత్యం బస్వరాజ్ పాటిల్ అన్నారు.ఎస్సీ, ఎస్టీలకు ఏ విధంగా చట్టసభల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారో, అదే విధంగా సమాజంలోని అట్టడుగు వర్గమైన దివ్యాంగులకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించి, వారి అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకపక్షాలపై ఉందన్నారు. చట్టసభలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల్లోనూ దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక పరిపాలనలో దివ్యాంగులను భాగస్వాములను చేసి, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో వారికి సముచిత పాత్ర కల్పించాలని కోరారు.

# జగ్గారెడ్డి ఫ్రస్ట్రేషన్‌తోనే హరీశ్‌రావుపై విమర్శలు

● పదవుల కోసమే అప్పుల కథలు.. పాస్‌పోర్ట్ కేసుతో మాకు సంబంధం లేదు

● సంగారెడ్డి అభివృద్ధిపై చర్చకు రావాలి.. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సవాల్



**సంగారెడ్డి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) ప్రతినిధి** జగ్గారెడ్డి చేస్తున్న విమర్శలు రాజకీయ ఫ్రస్ట్రేషన్‌తోనే కూడుకున్నవని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తారంటూ గతంలో రెండుసార్లు ప్రచారం చేసినా పర్యటన జరగలేదని, ఇప్పుడు సీఎం పర్యటన విషయంలో నెలకొన్న అక్కసుతోనే హరీశ్‌రావుపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**పదవుల కోసమే అప్పుల కథలు**

రాహుల్‌గాంధీ సభ కోసం రూ.6.5 కోట్ల అప్పు చేశానంటూ జగ్గారెడ్డి పదేపదే చెప్పుకోవడం రాజకీయ సానుభూతి కోసం చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు. నామినేటెడ్ పదవి కోసం సీఎం వద్ద సింపతీ పొందేందుకే ఈ కథలు చెబుతున్నారని ఆరోపించారు.

**పాస్‌పోర్ట్ కేసుతో సంబంధం లేదు**

పాస్‌పోర్ట్ బ్రోకర్ కేసు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కక్ష సాధింపు కేసు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే నమోదైన మానవ అక్రమ రవాణా కేసు అని తెలిపారు. విచారణలో ఆధారాలు లభించడంతో చట్ట ప్రకారం చర్యలు జరిగాయని, ఈ వ్యవహారంతో హరీశ్‌రావుకు, తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**మెడికల్ కాలేజీపై తప్పుడు ప్రచారం**

సంగారెడ్డి మెడికల్ కాలేజీని తానే తీసుకొచ్చానన్న జగ్గారెడ్డి వాదనను చింతా ప్రభాకర్ ఖండించారు. కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో మెడికల్ కాలేజీ మంజూరై ప్రారంభమైందన్నారు. అలాగే జగ్గారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన అవినీతి ఆరోపణలపై ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణ ఉద్యమ సమయంలో జగ్గారెడ్డి పాత్రపై విమర్శలు**

తెలంగాణ ఉద్యమ సమయంలో జగ్గారెడ్డి సమైక్యవాదుల వైపు నిలిచారని, సింగూర్ నీటి విషయంలోనూ తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడు తెలంగాణ, సంగారెడ్డి అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

**అభివృద్ధిపై చర్చకు రా..**

బీఆర్ఎస్ హయాంలో సంగారెడ్డిలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని చింతా ప్రభాకర్ తెలిపారు. 2023 ఎన్నికల్లో ప్రజలు జగ్గారెడ్డికి తగిన తీర్పు ఇచ్చారని అన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని సంగారెడ్డి అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని జగ్గారెడ్డికి సవాల్ చేశారు.

# విజ్ఞాన్ హైస్కూల్లో ఘనంగా బోనాల వేడుకలు




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 11:** నారాయణఖేడ్ పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్లో ఆషాఢమాస బోనాల ఉత్సవాలను పాఠశాల కరస్పాండెంట్ జి. సురేష్ గౌడ్, డైరెక్టర్ డాక్టర్ దిగ్గే బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని, వివిధ కళా ప్రదర్శనలు, నృత్యాలతో అలరించారు. విద్యార్థుల సంప్రదాయ వేషభూషణాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బోనాల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, విద్యార్థులు మన సంస్కృతిని గౌరవిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మానోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుమల వైన్ షాప్‌లో చోరీ: సుభాష్ గౌడ్




మనోహరాబాద్, ఆగస్టు 11 ( ప్రజా జ్యోతి) మానోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమల వైన్ షాప్‌లో చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు. వివరాలు ఆదివారం, రాత్రి సుమారు 10:00 గంటలకు వైన్ షాప్ సిబ్బంది షాప్‌ను యథావిధిగా తాళం వేసి ఇంటికి వెళ్లారు. అనంతరం సోమవారం, తెల్లవారు జామున సుమారు 03:00 గంటలకు వాచ్‌మన్ షాప్ వద్దకు వెళ్లి చూడగా షాప్ షట్టర్లు తెరిచి ఉండటాన్ని గమనించాడు. వెంటనే షాప్ సిబ్బందికి, యజమానికి సమాచారం అందించాడు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, గుర్తుతెలియని వ్యక్తులు వైన్ షాప్ షట్టర్ తాళాలను పగులగొట్టి, క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.10,000/- నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనపై మంగళవారం ఈఉదయం ఫిర్యాదు అందడంతో మానోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## పరికిబండలో ఘనంగా రేణుకఎల్లమ్మ బోనాల ఉత్సవాలు



మనోహరాబాద్, ఆగస్టు11 ( ప్రజా జ్యోతి) మండలం పరికిబండ గ్రామంలో ఆషాడ బోనాల మహోత్సవం పురస్కరించుకొని మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేడుకలో భాగంగా స్థానిక సర్పంచ్ మొతిబాయి లక్ష్మణ్ సింగ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం యువత ఆధ్వర్యంలో తోట్టేల ఊరగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల కార్యక్రమం లో ఉప సర్పంచ్ మహేష్, పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు,గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## రైతుల పరిస్థితి అగమ్యగోచరం



చిన్నకోడూరు, ఆగస్టు11, (ప్రజాజ్యోతి):-కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు,ఏఎంసీ మాజీ చైర్మన్ కాముని శ్రీనివాస్ లు అన్నారు. మంగళవారం నాడు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు లేవని తెలిసినా రైతులకు సమయానికి సాగునీరు అందించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. గత ప్రభుత్వం ముందస్తు ఆలోచనలతో కాళేశ్వరం నీటిని ప్రాజెక్టుల్లో నింపి రైతులకు సాగు నీరు అందించదన్నారు. గోదారి జలాలను పంటపొలాలకు ఇవ్వకుండా రైతులను కాంగ్రెస్ సర్కార్ పరేషాన్ చేస్తుందన్నారు. మండలంలో ఇప్పటికే 22వేల ఎకరాల్లో వరి,మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారని మరో మూడు వేల ఎకరాల్లో ఆయా రకాల పంటలను సాగు చేసే అవకాశం ఉందన్నారు. సాగు చేసిన పంటలకు నీరు అందించకుంటే పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందన్నారు. పంటలను కాపాడుకోవడంలో ఇబ్బందిపడుతున్నా రైతులను పట్టించుకోకుండా ఉండటం చూస్తుంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల్లోకి వెంటనే నీటినివదిలి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేదంటే కాంగ్రెస్ మంత్రుల, లీడర్ల పర్యటలనలను, కార్యక్రమాలను రైతులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ ధర్మాజీపేట తిరుపతి రెడ్డి, నాయకులు మేడికాయల వెంకటేశం, ఉమేష్ చంద్ర, ఏలేటి రాజిరెడ్డి, కాల్వ ఎల్లయ్య, దేవయ్య, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, భానుచందర్, ఆనంద్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగులకు 'కేసీఆర్ కోచింగ్' అండ

◆ పోలీస్ కొలువులకు సిద్దిపేటలో ఉచిత శిక్షణ



చిన్నకోడూరు, ఆగస్టు11, (ప్రజాజ్యోతి):- పోలీస్ కొలువులకు సంసిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు సిద్దిపేటలో ఉచిత శిక్షణ అందించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఆధ్వర్యంలో కేసీఆర్ ఉచిత కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్ఎస్వీ నాయకులు గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, భానుచందర్ లు తెలిపారు.గతంలో కేసీఆర్ ఉచిత కోచింగ్ సెంటర్లతో పోలీసు, గ్రూప్స్,ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించారన్నారు. చదువుపై ఆసక్తి ఉండి కోచింగ్ సెంటర్లకు ఫీజులు చెల్లించలేని యువత కొరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఉచిత కోచింగ్ సెంటర్ ను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంట్రన్స్ కొరకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారని అందుకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆనంద్, ప్రేమ్, రాజిరెడ్డి ఉన్నారు.


## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



తొగుట, ఆగస్టు 11(ప్రజాజ్యోతి): తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన పిఏసిఎస్ డైరెక్టర్ లింగాల నర్సవ్వ సోమవారం మృతి చెందడంతో, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సవ్వ కుటుంబ సభ్యులను కలిసి ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. నర్సవ్వ మృతి కుటుంబానికి, గ్రామానికి తీరని లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు, మాజీ అధ్యక్షులు ఆక్కం స్వామి, నాయకులు పాగాల కొండల్ రెడ్డి, దేవునూరి పోచయ్య, బండారు రమేష్ గౌడ్ , బైతి స్వామి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఊళ్లేంగల సాయి, చిక్కుడు ఉపలయ్య, చెరుకు మధుసూదన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భద్రెశీకల స్వామి, లింగాల కృష్ణ, మహేష్, వేంకట్, చిక్కుడు కర్ణాకర్ పాల్గొన్నారు.

## నిరుపేద దళిత రైతులకు న్యాయం చేయండి: అప్పాల మల్లేశం

మర్కూక్ ఆగస్టు 11(ప్రజాజ్యోతి) సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలో కొంతమంది దళిత రైతులకు ప్రభుత్వం కేటాయించిన వ్యవసాయ భూమిని, ఇతర ప్రాంతాల నుండి తెలియని వ్యక్తులు వచ్చి ఆ భూమిని స్వాధీనం చేసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేసిన రైతులు ఈ సందర్భంగా గ్రామ సీనియర్ నాయకుడు అప్పాల మల్లేశం మాట్లాడుతూ, తరతరాల నుండి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గ్రామ రైతులకు చెందిన దాదాపు 10 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తుల వల్ల వారికి అన్యాయం జరుగుతుందని అధికారులు వారికి న్యాయం చేయాలని ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వడం జరిగిందని వెంటనే సంబంధిత అధికారులు రైతులకు న్యాయం చేయాలని అన్నారు.





# అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర

◆ కొమురవెల్లిలో ఘన స్వాగతం.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం

◆ గౌడుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం: మేకపోతుల రమణగౌడ్

కొమురవెల్లి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):- అమరుల యాదిలో గీత కార్మికుల సమస్యల పరిష్కారం, గౌడుల హక్కుల సాధన లక్ష్యంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మేకపోతుల రమణగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన గీతన్నల చైతన్య బస్సు యాత్ర సోమవారం కొమురవెల్లి మండల కేంద్రానికి చేరుకుంది. యాత్రకు గీత కార్మికులు, గౌడ సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు.









**పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు**

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొమురవెల్లి మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజుగౌడ్ ఆధ్వర్యంలో గీతన్నలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురవెల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరులైన గౌడ వీరులను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గౌడుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

**హామీలు అమలు చేయాలి**

ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం గౌడ సంఘాలకు, గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గీత కార్మికులు, గౌడ సంఘాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గీత కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం చేపట్టిన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**యాత్రకు శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం**

గీతన్నల చైతన్య బస్సు యాత్రకు బీఆర్ఎస్ మాజీ మంత్రి విరాసతోళ్ల శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. గీత కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టిన చైతన్య యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది గౌడన్నలు తరలిరావడంతో కొమురవెల్లిలో సందడి నెలకొంది.

**మల్లన్నను దర్శించుకున్న గీతన్నల నేతలు**

అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బూడిద గోపి, వెంకటమలు తదితరులు కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, సంఘం సభ్యులు, గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# చేబర్తిలో బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మర్కూక్ ఆగస్టు 11(ప్రజాజ్యోతి) సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి:గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా చేబర్తి గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ నాయకుడు బబ్బూరి రాందాస్ గౌడ్, బాల వికాస ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతోనే ఈ శిబిరాన్ని ఏర్పాటు



చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని రోగులకు జనరల్ చెకప్, రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాధితులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారికి తదుపరి చికిత్స కోసం తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డ్ సభ్యులు,బాల వికాస గ్రామ అధ్యక్షుడు రాములు గౌడ్, నాయకులు తోట ఆంజనేయులు, ఓంకార్, గుడాల నరేష్,, చంద్రం, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలే రైతులకు రక్షణ

◆ ప్రాజెక్టుల నీరు తాగునీటికే పరిమితం ◆ జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట,ఆగస్టు 11, (ప్రజాజ్యోతి): జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల సాగులో ముందుచూపుతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అన్నపూర్ణ







సాగర్‌లో 3.50 టీఎంసీల సామర్థ్యానికి గాను 1.51 టీఎంసీలు, రంగనాయక సాగర్‌లో 3 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీలు, మల్లన్న సాగర్‌లో 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 15 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు.డెడ్ స్టోరేజీని మినహాయించిన తర్వాత వినియోగానికి అందుబాటులో ఉన్న నీటి పరిమాణం మరింత తక్కువగా ఉందని వివరించారు. శనిగరం ప్రాజెక్టులో 1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో జిల్లాలోని ప్రాజెక్టులకు కొత్తగా నీరు చేరలేదన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తక్షణంలో సాగునీటి లభ్యతపై స్పష్టత లేని కారణంగా రైతులు వరి సాగు చేపట్టడం ప్రమాదకరమని తెలిపారు.గత ఏడాది జిల్లాలో 4.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా.. 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి 1,200 కోట్లకు పైగా చెల్లించిందన్నారు.ఈ ఏడాది రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించడంతో ఇప్పటివరకు 70 వేల ఎకరాల్లో పంటల మార్పిడి జరిగిందన్నారు. కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు.ఆగస్టు 15 తర్వాత ఆముదం, పత్తి, నూనెగింజలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను రైతులు ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాధార పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురిసి ప్రాజెక్టుల్లోకి నీరు చేరితే, పరిస్థితిని బట్టి సాగునీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందన్నారు.ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి గూడవల్లి, హల్దివాగులోని చెక్‌డ్యామ్‌లను నింపితే ఆయా ప్రాంతాల్లో వ్యవసాయానికి కొంత వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ అంశంపై అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు.సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పంపిన లేఖను కలెక్టర్ సమావేశంలో చదివి వినిపించారు. గోదావరి నది నుంచి వృథాగా వెళ్లే నీటిని లిఫ్ట్ చేసి జిల్లాలోని ప్రాజెక్టులను నింపాలని, తద్వారా రైతులకు సాగునీరు అందించడంతో పాటు భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలని లేఖలో కోరినట్లు తెలిపారు.ఈ సమావేశంలో కరీంనగర్ సర్కిల్ సీఈ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఈలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగరాజు, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపు



**బోయినపల్లి, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :** ఆషాఢ మాస బోనాల జాతర సందర్భంగా అమ్మవారికి తొలి ప్రసాదంగా ఫలహారం బండిపై ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. న్యూ బోయినపల్లి బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ కమిటీ, బస్తీలోని యువజన సంఘం, జైరామ్ వ్యాయామశాల ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జంపన ప్రతాప్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలహారం బండ్ల ఊరేగింపును ప్రారంభించారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, అందమైన పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఫలహారం బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్యాండ్ మేళాల చప్పుళ్లు, పోతురాజుల నృత్యాలు, యువకుల తీన్మార్ డ్యాన్స్‌లతో ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది. పురవీధుల గుండా కొనసాగిన ఊరేగింపును చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను యువత ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు యాదవ్, పోతురాజు సాయి, కాసుల దామోదర్ గౌడ్, దుర్గయ్య, అజిత్, శ్రీకాంత్, కరణ్ సింగ్, దశరత్, నరేందర్, పవన్ ముదిరాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ యూత్ అవార్డు-26కు పైలట్ స్రవంతి, డా.వాసంతి ఎంపిక





**హైదరాబాద్, ఆగస్ట్ 11 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అందించే గ్లోబల్ యూత్ అవార్డు-2026కు పైలట్ స్రవంతి, కార్డియాలజిస్ట్ డాక్టర్ చింతల వాసంతి ఎంపికైనట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్(టీసీసీ) రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ కార్డియాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ చింతల వాసంతి, ఇండిగో ఎయిర్‌లైన్స్ శంషాబాద్ బేస్‌లో పైలట్‌గా పనిచేస్తున్న స్రవంతి సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

## పిల్లల పొట్టలో దాగిన ముప్పు.. నులిపురుగులపై నిఘా అవసరం!

**చిన్న సమస్యగా భావిస్తే పెద్ద ఆరోగ్య నష్టం.. పరిశుభ్రత, పోషకాహారం, సకాలంలో నివారణతోనే రక్షణ**



**నాగారం, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :** చిన్నారుల ఆరోగ్యాన్ని లోపలినుంచే దెబ్బతీసే నులిపురుగుల సమస్యపై ప్రతి తల్లిదండ్రి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లలు చురుకుగా కనిపిస్తున్నప్పటికీ, శరీరంలో నులిపురుగులు ఉంటే వారికి అందే పోషకాలు తగ్గిపోయి క్రమంగా బలహీనత, రక్తహీనత, ఎదుగుదలలో మందగింపు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందువల్ల నులిపురుగులను సాధారణ సమస్యగా తీసుకోకుండా, ముందస్తు జాగ్రత్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**పిల్లల ఎదుగుదలకు అడ్డంకిగా నులిపురుగులు :**
పిల్లల శరీరానికి అవసరమైన పోషకాలు సక్రమంగా అందకపోవడానికి నులిపురుగుల సమస్య కూడా ఒక కారణం కావచ్చు. ఫలితంగా బరువు పెరగకపోవడం, ఆకలి తగ్గడం, తరచూ కడుపునొప్పి, బలహీనత, రక్తహీనత వంటి లక్షణాలు కనిపించవచ్చు. దీని ప్రభావం పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత, రోజువారీ చురుకుదనంపైనా పడే అవకాశం ఉంది.

**మురికి చేతుల నుంచి ముప్పు :**
పరిశుభ్రత లోపమే నులిపురుగుల వ్యాప్తికి ప్రధాన కారణాల్లో ఒకటి. మట్టితో లేదా మురికితో సంబంధం ఉన్న తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహారం తీసుకోవడం, గోళ్లను పెంచుకోవడం, శుభ్రం చేయని పండ్లు--కూరగాయలు తినడం, కలుషిత నీటిని వినియోగించడం వంటి అలవాట్లు పిల్లల ఆరోగ్యానికి ముప్పుగా మారవచ్చు.

అందుకే భోజనం ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం ప్రతి చిన్నారి జీవితంలో తప్పనిసరి అలవాటుగా మారాలి. గోళ్లను క్రమం తప్పకుండా కత్తిరించాలి. పరిశుభ్రమైన నీటినే తాగాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతే తీసుకోవాలి.

**పోషకాహారమే పిల్లలకు రక్షణ కవచం :**
పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్యమైన పోషకాహారం అత్యంత అవసరం. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించాలి. నులిపురుగుల సమస్య ఉన్నట్లు అనుమానం వచ్చినప్పుడు పిల్లల ఆహారం, బరువు, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

**లక్షణాలను తేలికగా తీసుకోవద్దు :**
పిల్లల్లో తరచూ కడుపునొప్పి, ఆకలి తగ్గడం, బలహీనత, రక్తహీనత, బరువు పెరగకపోవడం లేదా ఎదుగుదల మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచన లేకుండా నులిపురుగుల నివారణ మందులను స్వయంగా ఇవ్వకూడదు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా నులిపురుగుల నివారణకు అందించే మందులను ఆరోగ్య సిబ్బంది సూచించిన విధంగా పిల్లలకు అందించాలి. తల్లిదండ్రులు ఈ కార్యక్రమాల ఉద్దేశాన్ని అర్థం చేసుకుని చురుకుగా సహకరించాలి.

**ఇంట్లోనే కాదు.. పాఠశాలలోనూ అవగాహన :**
పిల్లలు రోజులో ఎక్కువ సమయం గడిపే పాఠశాలల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై నిరంతర అవగాహన కల్పించాలి. చేతులు కడుక్కోవడం, పరిశుభ్రమైన నీటిని వినియోగించడం, మరుగుదొడ్లను సక్రమంగా ఉపయోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను చిన్నతనం నుంచే పెంపొందించాలి. నులిపురుగుల నివారణ ఒక్కరోజు కార్యక్రమంతో పూర్తయ్యే విషయం కాదు. పరిశుభ్రతను జీవనశైలిగా మార్చడం, పోషకాహారాన్ని అందించడం, ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేయడం ద్వారా మాత్రమే పిల్లలను ఆరోగ్యంగా పెంచగలం.

**పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు బలం :**
చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే వారు చురుకుగా చదువుకుంటారు, సమర్థవంతంగా ఎదుగుతారు, భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవుతారు. అందుకే నులిపురుగుల సమస్యను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, ఆరోగ్య కార్యకర్త తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి.

"నులిపురుగులను నిర్లక్ష్యం చేయొద్దు. పరిశుభ్రతను అలవాటు చేసుకోండి..
పోషకాహారాన్ని అందించండి..
పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయండి!"

డా. గంప ధీరజ్ కుమార్
ఎం.డి. (జనరల్ మెడిసిన్)

## రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

- ప్రజా సమస్యలు పరిష్కరించుకుందాం-వ్యక్తిగతం పక్కన పెడదాం - అధికారులు సక్రమంగా పనిచేయండి-ప్రభుత్వం ఫైనాన్స్ గా చూసుకుంటుంది
- ఈ రహదారుల నుంచి దిశా మార్గంమారుతుంది - ఉత్తిత్తి జీవులతో సరి పెట్టలేదు జూనియర్ కాలేజ్ 10 కోట్ల దవఖాన
- సర్వసభ్య సమావేశం దేవాలయం లాంటిది - బషీరాబాద్ సర్వసభ్య సమావేశంలోపాల్గొన్న -తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి









**బషీరాబాద్ ఆగస్టు 11 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ మండల కేంద్రంలో మంగళవారం రైతు వేదిక నందు ఏర్పాటుచేసిన సర్వసభ సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి పాల్గొని ఈ సందర్భంలో మాట్లాడుతూ సర్వసభ సమావేశం ఒక దేవాలయం లాంటిది సమస్యలు లేవనెత్తండి వాటికి పరిష్కారం చేసుకోండి అని అన్నారు. 150 కోట్లతో లక్ష్మీనారాయణపూర్ టు మైల్వార్, 30 కోట్లతో బషీరాబాద్ టు కరణ్ కోట్, మంతటి టు నారాయణపూర్, ఈ రోడ్డు మార్గాలతోని ఆ గ్రామాలకు దిశమార్గమే మారుతుందని పేర్కొన్నారు. బషీరాబాద్ మండలంలో పాఠశాలలకు కాంపౌండ్ వాల్ నిధులు మంజూరు చేశామని, సమస్యలుపరిష్కరించుకుందాం వ్యక్తిగత అభిప్రాయాలు పక్కన పెట్టి అభివృద్ధి చేసుకోండి అని సూచించారు. అధికారులు సక్రమంగా పనిచేసే కావలసిన నిధులు తీసుకొని అభివృద్ధి చేయండి అని అన్నారు. పలు శాఖల అధికారులపై గ్రామ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారిపై ఫోన్లు లేపడం లేదు, సరియైన టైం కు ఎల్సిలు ఇవ్వడం లేదని, కరెంటు తంబలపై, ట్రాన్స్ఫర్ లపై విద్యుత్ సమస్యపై పలువురు సర్పంచులు నిలదీయడం జరిగింది. ఇటి విషయంపై ఎమ్మెల్యే ప్రతి గ్రామ సర్పంచి ఫోన్ చేసిన వారితో మాట్లాడి వారికి సరియైన సమాధానాలు ఇచ్చి ఏదైనా కరెంటు సమస్యలు ఉంటే వెంటనే చేయాలని ఏఈకి ఎమ్మెల్యే సూచించారు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని. వచ్చిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లేదని పలువురు గ్రామ సర్పంచులు ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి డాక్టర్లు విధులు సక్రమంగా నిర్వహించి నిరుపేదలకు మేరుగైన వైద్య సేవ అందించాలని సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ గ్రామాలలో పనిచేసినటువంటి వాటి గురించి వివరిస్తుండగా కొన్ని సరియైన సమాధానాలు చెప్పలేక మధ్యలో ఎమ్మెల్యే వారిపై ఆగ్రా వ్యక్తం చేశారు. స్టేషన్ వెనుకల రోడ్డు విస్తరణకు అక్కడున్న ఇండ్లు తొలగించడం జరుగుతుంది వారికి ప్రభుత్వ భూమి ఎక్కడుందో చూసి వారికి ఏర్పాట్లు చేయాలని తహసిల్దార్ కి ఎమ్మెల్యే సూచించడం జరిగింది. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో విస్తృతంగా చర్చించిన ఎమ్మెల్యే ..గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి. విద్యుత్ సరఫరా, లూజు వైర్లు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈకి ఆదేశం. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వాహణపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో వర్షాకాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, సర్పంచ్ లకు ఆదేశం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాల గురించి ఆరా. వ్యవసాయానికి సంబంధించిన అంశాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలపై ఆరా. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ మహారాజ్, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి , వెంకట్ రాం రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో సంపత్ కుమార్, తహసిల్దార్ సహిదాబేగం, మండల విద్యాధికారి దూసరాములు, ఏపీఎం పద్మారావు, ఎనర్జీ ఎస్ అధికారి శారద, మండల వ్యవసాయ శాఖ అధికారి అనిత,వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, పంచాయతీ సెక్రెటరీ, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగులపై నిర్లక్ష్యం వద్దు.. రైతు ఆరోగ్యానికి అప్రమత్తతే ఆయుధం!

**పశువుల నుంచి మనుషులకు వ్యాధుల వ్యాప్తికి అవకాశం.. పరిశుభ్రత, సురక్షిత నీరు, సరైన పారిశుద్ధ్యంతో నియంత్రణ సాధ్యం**



**నాగారం, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) :**
వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని పొలాల్లో శ్రమించే రైతులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. పంటల సాగు, పశుపోషణ, పొలాల్లో మట్టి--నీటితో నిరంతర సంబంధం కారణంగా రైతులు వివిధ రకాల పరాన్నజీవులు, ముఖ్యంగా నులిపురుగుల బారిన పడే అవకాశం ఉంటుంది. అయితే నులిపురుగుల సమస్యను కేవలం చిన్న ఆరోగ్య సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, పశువుల ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చు.

రైతులకు ఎందుకు ఎక్కువ అప్రమత్తత అవసరం?
రైతు రోజులో ఎక్కువ సమయం పొలంలోనే గడుపుతాడు. మట్టి, నీరు, పశువులు, పశువుల వ్యర్థాలు, సేంద్రియ ఎరువులు వంటి వాటితో నేరుగా సంబంధం కలిగి ఉంటాడు. ఈ పరిస్థితుల్లో చేతులు సరిగా శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకోవడం, శుభ్రమైన నీరు కాకుండా అనుమానాస్పద నీటిని తాగడం, పాదరక్షలు లేకుండా పొలాల్లో తిరగడం, పశువుల కొట్టాన్ని పరిశుభ్రంగా ఉంచకపోవడం వంటి అలవాట్లు ఆరోగ్యపరమైన ఇబ్బందులకు కారణం కావచ్చు. అందువల్ల "పొలంలో జాగ్రత్త.. ఇంట్లో పరిశుభ్రత.. ఆరోగ్యంపై శ్రద్ధ" అనే మూడు సూత్రాలను ప్రతి రైతు కుటుంబం పాటించాలి.

నులిపురుగులు అంటే ఏమిటి?
మనుషులు లేదా పశువుల శరీరంలో జీవిస్తూ పోషకాలను వినియోగించే కొన్ని పరాన్నజీవులను సాధారణంగా నులిపురుగులు అని పిలుస్తారు. వీటిలో వివిధ రకాల పురుగులు ఉంటాయి.

నులిపురుగుల రకం, సంక్రమణ తీవ్రత, వ్యక్తి వయస్సు, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను బట్టి లక్షణాలు మారవచ్చు. కాబట్టి కేవలం ఒక లక్షణం కనిపించిందని నులిపురుగుల సమస్యేనని నిర్ణయించుకోకుండా వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

**కడుపునొప్పి వస్తే నిర్లక్ష్యం చేయొద్దు :**
కొంతమందిలో నులిపురుగుల సంక్రమణ ఉన్నప్పుడు కడుపునొప్పి, ఆకలి మార్పులు, విరేచనాలు లేదా మలబద్ధకం, నీరసం, బలహీనత, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. పిల్లల్లో ఎదుగుదలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

అయితే ఈ లక్షణాలు ఇతర అనేక అనారోగ్య పరిస్థితుల్లో కూడా కనిపించవచ్చు. అందువల్ల "కడుపులో పురుగులే ఉంటాయి" అని స్వయంగా నిర్ణయించుకుని మందులు వేసుకోవడం కంటే వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

**పశువుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకండి :** రైతు కుటుంబానికి పశువులు కేవలం ఆస్తి మాత్రమే కాదు.. జీవనాధారానికి ముఖ్యమైన భాగం. పశువుల్లో కూడా వివిధ రకాల పరాన్నజీవుల సమస్యలు ఏర్పడవచ్చు. పశువులు నీరసంగా కనిపించడం, బరువు తగ్గడం, ఆహారం తీసుకోవడంలో మార్పులు, విరేచనాలు, పాలు తగ్గడం వంటి అసాధారణ లక్షణాలు కనిపిస్తే పశువైద్యుడిని సంప్రదించాలి.

పశువులకు నులిపురుగుల నివారణ మందులను పశువైద్యుల సూచన మేరకు మాత్రమే ఇవ్వాలి. పశువు బరువు, వయస్సు, ఆరోగ్య పరిస్థితి, గర్భధారణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా మందులను స్వయంగా ఇవ్వడం సరికాదు.

**పశువుల కొట్టం పరిశుభ్రంగా ఉండాలి :**
పశువుల కొట్టంలో మలం, మూత్రం, తడి మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. పశువులు తాగే నీటి పాత్రలను కూడా క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. పశువుల ఆహారం, తాగునీరు మలంతో కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పశువుల వ్యర్థాలను ఇల్లు, తాగునీటి వనరులకు సమీపంలో పేరుకుపోకుండా తగిన విధంగా నిర్వహించాలి. పశువుల కొట్టం పరిశుభ్రంగా ఉంటే పశువుల ఆరోగ్యమే కాదు.. రైతు కుటుంబ ఆరోగ్యానికి కూడా రక్షణ పెరుగుతుంది.

**పొలాల్లో పనిచేసేటప్పుడు చెప్పులు తప్పనిసరి :** మట్టిలో పనిచేసే రైతులు సాధ్యమైనంత వరకు పాదరక్షలు ధరించాలి. కొన్ని పరాన్నజీవుల లార్వాలు కలుషితమైన మట్టిలో ఉండే అవకాశం ఉన్నందున పాదరక్షలు లేకుండా ఎక్కువసేపు మట్టిలో నడవడం నివారించడం మంచిది. పొలాల్లో పనిచేసి ఇంటికి వచ్చిన తర్వాత చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలి. మట్టి అంటుకున్న దుస్తులను మార్చుకోవాలి. ముఖ్యంగా భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం తప్పనిసరి.

**తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ :** గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పరిశుభ్రత అత్యంత ముఖ్యమైన అంశం. తాగునీటి వనరుల చుట్టూ అపరిశుభ్రత ఉండకుండా చూసుకోవాలి. మురుగునీరు తాగునీటిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీటిని నిల్వ చేసే పాత్రలను మూతపెట్టి ఉంచాలి. అనుమానాస్పద నీటిని నేరుగా తాగకుండా సురక్షితమైన నీటినే వినియోగించాలి. నీరు శుభ్రంగా ఉంటే అనేక రకాల నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చు.

**ఆహార పరిశుభ్రత కూడా అంతే ముఖ్యం :** పండ్లు, కూరగాయలను బాగా కడిగి వినియోగించాలి. వండిన ఆహారాన్ని ఎక్కువసేపు తెరిచి ఉంచకూడదు. ముడి ఆహారం, వండిన ఆహారం కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

చేతులు కడుక్కోకుండా తినడం, శుభ్రం చేయని ఆహారం తీసుకోవడం, ఈగలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఆహారాన్ని తెరిచి ఉంచడం వంటి అలవాట్లను మార్చుకోవాలి.

**పిల్లల విషయంలో మరింత జాగ్రత్త :** రైతు కుటుంబాల్లో పిల్లలు పొలాల్లో, మట్టిలో ఆడుకోవడం సాధారణం. అందువల్ల వారికి చిన్న వయస్సు నుంచే చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.

గోళ్లు చిన్నగా కత్తిరించాలి. మట్టిలో ఆడుకున్న తర్వాత చేతులు కడుక్కోవాలి. చేతులు కడుక్కోకుండా ఆహారం తీసుకోకుండా చూడాలి. సురక్షితమైన తాగునీటినే ఇవ్వాలి. అసాధారణ ఆరోగ్య లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి. పిల్లల్లో తరచూ కడుపునొప్పి, బలహీనత, విరేచనాలు, బరువు సరిగా పెరగకపోవడం వంటి సమస్యలు ఉంటే కారణాన్ని వైద్యుల ద్వారా గుర్తించాలి.

**మందుల విషయంలో స్వీయచికిత్స వద్దు :** నులిపురుగుల నివారణకు మందులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రతి వ్యక్తికి, ప్రతి పశువుకు ఒకే మందు లేదా ఒకే మోతాదు సరిపోతుందని భావించడం తప్పు. వయస్సు, బరువు, ఆరోగ్య పరిస్థితి, సంక్రమణ రకం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

పశువులకు పశువైద్యుడు.. మనుషులకు వైద్యుడు అనే సూత్రాన్ని రైతులు గుర్తుంచుకోవాలి. పొరుగువారు ఉపయోగించిన మందును తాము కూడా ఉపయోగించడం లేదా పాత మందులను స్వయంగా తీసుకోవడం నివారించాలి.

**పరిసరాల పరిశుభ్రతే ప్రధాన రక్షణ :** నులిపురుగుల సమస్యను నియంత్రించడంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామస్థాయి పారిశుద్ధ్యం కూడా ముఖ్యమే. బహిరంగ మలవిసర్జనను నివారించడం, మరుగుదొడ్లను వినియోగించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకపోవడం, మురుగునీటిని సక్రమంగా నిర్వహించడం వంటి చర్యలు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తాయి.

ఒక కుటుంబం మాత్రమే పరిశుభ్రంగా ఉంటే సరిపోదు. గ్రామంలోని ప్రతి కుటుంబం పరిశుభ్రతను పాటించినప్పుడే గ్రామస్థాయి వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుంది.

**రైతు ఆరోగ్యమే గ్రామ ఆర్థిక ప్రగతికి పునాది :** రైతు అనారోగ్యానికి గురైతే వ్యవసాయ పనులు దెబ్బతింటాయి. పశువుల సంరక్షణ, పంటల నిర్వహణ, కుటుంబ బాధ్యతలు అన్నింటిపైనా ప్రభావం పడుతుంది. అందుకే ఆరోగ్యాన్ని ఖర్చుగా కాకుండా భవిష్యత్తుకు పెట్టుబడిగా చూడాలి.

చిన్న లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య సలహా తీసుకోవడం వల్ల సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**ప్రతి రైతు గుర్తుంచుకోవాల్సిన ఐదు సూత్రాలు :** 1. చేతుల పరిశుభ్రత -- భోజనం ముందు, మరుగుదొడ్డి తర్వాత, పశువులను చూసుకున్న తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలి.

2. సురక్షిత నీరు -- శుభ్రమైన, సురక్షితమైన తాగునీటినే ఉపయోగించాలి.

3. పశువుల సంరక్షణ -- పశువులకు క్రమం తప్పకుండా పశువైద్యుల సలహాతో ఆరోగ్య పరీక్షలు, అవసరమైన పరాన్నజీవుల నియంత్రణ చర్యలు చేపట్టాలి.

4. పరిశుభ్రమైన పరిసరాలు -- పశువుల కొట్టాలు, ఇళ్లు, నీటి వనరులు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.

5. స్వీయచికిత్స వద్దు -- అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వైద్యుడు లేదా పశువైద్యుడిని సంప్రదించాలి.

**రైతన్నా.. ఆరోగ్యంపై రాజీ పడొద్దు! :** పంటను కాపాడుకోవడానికి రైతు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటాడో.. తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా అంతే జాగ్రత్తలు తీసుకోవాలి. పంటకు పురుగు మందు వేసినంత మాత్రాన పని పూర్తికాదు. రైతు తన ఆరోగ్యాన్ని, కుటుంబ ఆరోగ్యాన్ని, పశువుల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి. నులిపురుగులు కనిపించకపోయినా వాటి ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేయకూడదు. నివారణ, పరిశుభ్రత, సురక్షితమైన నీరు, సరైన వైద్య సలహా---ఈ నాలుగు అంశాలను పాటిస్తే ఆరోగ్యపరమైన ముప్పులను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

**ముగింపు సందేశం :**
"పశువుల ఆరోగ్యం కాపాడితే రైతు సంపద కాపాడినట్టే..
రైతు ఆరోగ్యం కాపాడితే కుటుంబ భవిష్యత్తును కాపాడినట్టే..
పరిశుభ్రత పాటిస్తే నులిపురుగులకు తలుపులు మూసినట్టే!"
రైతన్నా.. అప్రమత్తంగా ఉండు -- పరిశుభ్రత పాటించు -- ఆరోగ్యంగా ఉండు!

సి. హెచ్. కాశీ విశ్వనాథ్,
మేనేజింగ్ డైరెక్టర్, వేణు ఫీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,
వైస్ ప్రెసిడెంట్ , ఐపీజీఏ- తెలంగాణ స్టేట్ బ్రాంచ్

## సిపిఐ పాదయాత్రను విజయవంతం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటి సురేష్ కుమార్
- పాదయాత్రకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్



**కొడంగల్ ఆగస్ట్ 12 ప్రజా జ్యోతి :** నేడు కోడంగల్ లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు, మంగళవారం కోడంగల్‌లోని ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బుధవారం కోడంగల్‌లో అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే సిపిఐ పాదయాత్రకు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించే పాదయాత్రకు నాయకులు, కార్యకర్తలు,ప్రజలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో కళ్యాణ మహోత్సవ వేడుకలు



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు11 (ప్రజాజ్యోతి) :** హయత్ నగర్ కుంట్లూరు రోడ్డు లోని శుభోదయ కాలనీలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ తల్లి దేవాలయంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ మునిరాజు కళ్యాణ మహోత్సవ వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించడం జరుగుతుందని శుభోదయం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. ఈనెల 13,14 గురు, శుక్రవారాల్లో శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణము, ఒగ్గు రాజు కొత్తగూడెం బృందం చే నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 13న ఉదయం 10:30 గంటలకు పుట్ట బంగారం, సాయంత్రం 6:30 కు గంగా స్నానం కార్యక్రమము, మరుసటి రోజు ఉదయం 10:30 గంటలకు శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ మునిరాజు కళ్యాణము, మధ్యాహ్నం ఒంటిగంటకు వీర బోనం నిర్వహించడం జరుగుతుందని శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొమ్మాటి సునీత గోపాల్, జనరల్ సెక్రెటరీ దుబ్బాక సతీష్, కోశాధికారి పున్న శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో శుభోదయ కాలనీ భక్తులతో పాటుగా సమీప కాలనీలా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సైబరాబాద్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేత పిడికిటి గోపాల్ చౌదరి

**ప్రజా సమస్యలు, శాంతిభద్రతల అంశాలపై సీపీ రమేష్ రెడ్డితో చర్చ**



**కూకట్‌పల్లి, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) :**
సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిడికిటి గోపాల్ చౌదరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు అంశాలతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించిన వివిధ విషయాలపై సీపీతో గోపాల్ చౌదరి చర్చించినట్లు తెలిపారు. ఈ భేటీలో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు భద్రత కల్పించడం తదితర అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నట్లు సమాచారం. ప్రజల సమస్యలను పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగినట్లు గోపాల్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ రెడ్డి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను వివరించినట్లు తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం సీపీ రమేష్ రెడ్డిని పిడికిటి గోపాల్ చౌదరి శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీకి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగినట్లు గోపాల్ చౌదరి పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలు, స్థానిక సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖతో సమన్వయంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా గోపాల్ చౌదరి తెలిపారు.

## కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌కు బీఆర్ఎస్ యువ నాయకుల అభినందనలు

మెట్‌పల్లి, ఆగస్టు 11, ప్రజా జ్యోతి : మెట్‌పల్లి పట్టణంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వనభోజనాలు, బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు పట్టణంలో పారిశుధ్యం, పరిసరాల పరిశు



భ్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించి సమర్థవంతంగా విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. బీఆర్ఎస్ యువ నాయకులు మొరపు తేజ, కొండ్లేపు శ్యామ్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా పట్టణానికి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో నిరంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా కమిషనర్ చేసిన కృషి అభినందనీయమన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ యంత్రాంగం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ సాంకేతికతపై విద్యార్థులకు శిక్షణ

కొడిమ్యాల, ఆగస్ట్ 11,(ప్రజాజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో 'డ్రోన్‌ఎక్స్‌ప్లోర్' పేరిట రెండు రోజుల సాంకేతిక కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈఈఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలు, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, జేఎన్టీయూ




హెచ్–టిబీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు డ్రోన్ సాంకేతికత, యూఏవీ వ్యవస్థలు, సిమ్యులేషన్, నావిగేషన్‌పై సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు. ఏరోఫోర్జ్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ ఆదర్శ్ డ్రోన్‌ల ప్రాథమిక అంశాలు, వినియోగాలు, విమాన గమన శాస్త్రం, ఆధునిక సాంకేతికతలపై వివరించారు. వ్యవసాయం, నిఘా, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాల్లో డ్రోన్‌ల వినియోగాన్ని వివరించారు. అనంతరం వే పాయింట్ ఆధారిత మిషన్ ప్రణాళిక, యూఏవీ సిమ్యులేషన్‌పై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు.రెండో రోజు నావిగేషన్, జీపీఎస్, కంప్యూటర్ విజన్, డ్రోన్ విమాన ప్రయోగాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి. నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, విభాగాధిపతులు సి. రాధా చరణ్, డాక్టర్ సీహెచ్ శ్రీధర్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సురేష్, జేఎన్టీయూహెచ్–టిబీఐ ప్రోగ్రాం మేనేజర్ స్వాతి ఆనందం పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో బోనాల సందడి

కొడిమ్యాల,ఆగస్టు 11,(ప్రజాజ్యోతి): మండలం తిర్మలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణతో, పోచమ్మ



బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. గ్రామపంచాయతీ కూడలిలో విద్యార్థుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోచమ్మకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తైదల అంజయ్య, ఉపసర్పంచ్ ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగుల మల్లేష్‌యాదవ్,కోలకాని పద్మ, సత్యం, ప్రధానోపాధ్యాయులు బి.జోష్ణదేవి, దేవరాజం,ఏనుగు ఆదిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకాపై అవగాహన

రాయికల్,ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) : అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్,సీజనల్ వ్యాధులు,వ్యక్తిగత పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి సతీష్‌కుమార్ విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యతను వివరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, ఉపాధ్యాయురాలు లక్ష్మి పాల్గొన్నారు.



# హిందువుల ఐక్యతతోనే దేవాలయాలు , సనాతన ధర్మంపై విద్రోహుల దాడులను అరికట్టవచ్చు

రాయికల్, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, లోకకల్యాణం, ధర్మస్థాపన, ధర్మపాలకుల రక్షణ జరగాలనే విద్రోహుల, తీవ్రవాదుల నుండి దేశం సంరక్షించ బడాలనే, భక్తుల ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలనే సత్ సంకల్పాలతో వీరాపూర్ లో భగవద్గీత ధర్మ ప్రచారక్ లు జవ్వాజి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో, వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్ర గ్రామ పంచాయితీ నుండి శ్రీ హనుమాన్ దేవాలయం వరకు ఘనంగా జరిగింది.



ఆలయ అర్చకులు చెరుకు మధు శర్మ, వికాస తరంగిణి బాధ్యులు చిలుకమర్రి శ్యామసుందరాచారి, వేల్పుల స్వామి యాదవ్, గన్నవరం గంగాధర్ లు శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ రామస్వామి గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు నీలి మహేందర్, ఉపసర్పంచ్ దంపాల నర్సారెడ్డి లకు అందజేయడంతో గ్రామపంచాయతీ నుంచి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు జై శ్రీరామ్ నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమ నిర్వహకులు, భగవద్గీత ధర్మ ప్రచారకులు జవ్వాజి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హిందువులు కులాల వారిగా, రాజకీయాల వారిగి విడిపోవడం, అనైక్యత కారణంగా హిందువుల శక్తిపీఠాలు, శక్తి కేంద్రాలైన దేవాలయాలపై, సనాతన ధర్మంపై కొందరు విద్రోహులు దాడులు చేయడం చూడడం బాధాకరమని, కేవలం సనాతన ధర్మంలోనే లోకా సమస్తా సర్వేజన సుఖినోభవంతు, స్వీయ ఆరాధన, సర్వ ఆదరణ అనే ఆచరణాత్మకత కనిపిస్తుందని, హిందువుల ఐక్యత తోనే దేవాలయాలు, సనాతన ధర్మంపై విద్రోహుల దాడులను అరికట్టవచ్చని ఇకనైనా హిందువులు ఐక్యంగా వుండాలని అన్నారు. ఆర్.ఎస్.ఎస్ జిల్లా సహకార్యవాహ్ కొంగరి సాయికృష్ణ శ్రీరామున్ని ఆదర్శంగా తీసుకుని నిత్యజీవితంలో ఆచరించాలని అన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవి రచయిత కనికరపు స్వామి, జవ్వాజి రాములు, సోమ రాజు, మోతె ప్రదీప్, దమ్మ రాజు, కోమటి రమేష్, నారాయణ, బైరి అక్షయ్, నరేందర్, లచ్చన్న, లత, లలిత, శ్రీమతి, లావణ్య, మమత 200 మంది అంజనేయ స్వామి భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు, వృద్ధుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ

సుల్తానాబాద్, ఆగస్టు 11: (ప్రజా జ్యోతి) సంక్షేమ శాఖ పరిధిలోని సంస్థల్లో వసతి పొందుతున్న చిన్నారులు, వృద్ధుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం, బాల సదనం, మండల విద్యా వనరుల కేంద్రంతో పాటు పెద్దపల్లిలోని రంగంపల్లి బాల రక్షక భవన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వంటశాలలు, వసతి గదులు, పరిసరాలను పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు, వృద్ధులకు అందుతున్న సేవలు, భద్రతా చర్యలను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. సంస్థల్లో పరిశుభ్రత, నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు.బాల రక్షక భవన్‌లో చిన్నారుల సంరక్షణ, రక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. సిబ్బంది తమ జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం పోక్సో కేసుల వివరాలను తెలుసుకుని, బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ, కౌన్సెలింగ్, అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలలపై హింస, వేధింపులు, నిర్లక్ష్య ఘటనలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.



## బీర్‌పూర్‌లో ఘనంగా బీజేపీ 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ

### జాతీయ జెండా దేశభక్తి, ఐకమత్యానికి ప్రతీక: ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్

### భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తిన బీర్‌పూర్

బీర్ పూర్, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీర్‌పూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఆడెపు నర్సయ్య నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీకి బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ ముఖ్య అతిథిగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ జెండా కోట్లాది భారతీయులను ఒకే తాటిపైకి తెచ్చే ఐకమత్యానికి, దేశభక్తికి ప్రతీక అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ, కులమతాలకు అతీతంగా "దేశం ముందు – మనం తర్వాత" అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా ద్వారా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని, బాధ్యతను చాటడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. చేతుల్లో జాతీయ జెండాలతో కార్యకర్తలు చేసిన "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో బీర్‌పూర్ వీధులన్నీ దేశభక్తి స్ఫూర్తితో హోరెత్తాయి. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గర్షకుర్తి రమేష్, ప్రధాన కార్యదర్శి బండారి రవి, నాయకులు సామల గంగాధర్, మామిడిపెల్లి లింగన్న, అజ్మీరా రాజేందర్, ఉయ్యాల స్వామి, దాసరి రామన్న, అజ్మీరా రాజు, అల్లే మల్లేశం తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాల సమస్యలు పరిష్కరించాలి

చొప్పదండి ,ఆగస్టు 11 (ప్రజా జ్యోతి): చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కళాశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంభోజి సునీల్



మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, పాలకవర్గానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. హాస్టల్ చుట్టూ మట్టి రోడ్డు పైకి వచ్చిన చెట్టుకొమ్మలు తొలగించాలని, మట్టి రోడ్ పై ఉన్న గుంతలు పూడ్చివేయాలని, హాస్టల్ కి వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు బి. రాజేష్, పిట్ట భూమయ్య, జువాజీ దేవేందర్, చిలక సత్తయ్య, కౌన్సిలర్ కొత్త గంగారెడ్డి, వల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ మెకానిక్ సోదరులకు అండగా ఉంటా

### మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 11, ప్రజా జ్యోతి: పెద్దపల్లి పట్టణంలోని బైక్ మెకానిక్ సోదరులకు ఎల్లవేళలా అండగా ఉంటానని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో టూ వీలర్ మెకానిక్‌లకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైక్ మెకానిక్‌లు పట్టణ ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మెకానిక్ సోదరులకు ఏ సమయంలో ఎలాంటి సమస్య ఎదురైనా



తనను సంప్రదించవచ్చని భరోసా కల్పించారు. సంక్షేమ సంఘం భవనానికి కృషి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజ్జన్న సహకారంతో బైక్ మెకానిక్ సంక్షేమ సంఘానికి ప్రత్యేక భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని మల్లయ్య తెలిపారు. మెకానిక్‌ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానన్నారు. గత 25 సంవత్సరాలుగా బైక్ మెకానిక్ సంఘం గౌరవ అధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచి, అభిమానంతో ఆదరిస్తున్న మెకానిక్ సోదరులందరికీ ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి భవిష్యత్తులోనూ తన సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శాలువాతో సన్మానం ఈ సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు, మెకానిక్ సోదరులు మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బైక్ మెకానిక్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాండ్ల మల్లయ్య నేత్రాలు సజీవం

చొప్పదండి, ఆగస్టు 11 ( ప్రజా జ్యోతి): చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామం కు చెందిన పెరుమాండ్ల మల్లయ్య(59) గుండెపోటుతో మరణించగా అమరగోని సతీష్, లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి కొల్లూరి జితేందర్ నేత్రదానం పై అవగాహన కల్పించి వారి కుమారుడు పెరుమాండ్ల రవి అనుమతితో మల్లయ్య నేత్రాలను వాసన్ ఐ కేర్ ఆసుపత్రి టెక్నీషియన్ చందు ద్వారా సేకరించి హైదరాబాదులోని వాసన్ ఐ కేర్ ఐ బ్యాంక్ కు తరలించారు. ఈ సందర్భంగా చొప్పదండి లయన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్మన్, జిల్లా జాయింట్ క్యాబినెట్ కోశాధికారి కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ మల్లయ్య నేత్రాలు ఇద్దరు అంధులకు చూపును ఇస్తాయని, భౌతికంగా మరణించినా నేత్రాలు సజీవంగా ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా పుట్టెడు దుఖంలోనూ ఉదారత చాటిన మృతుడి కుటుంబ సభ్యులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతూ నేత్రదాత స్వర్గీయ పెరుమాండ్ల మల్లయ్య కు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అమరగోని సతీష్, సంపత్, హరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న భక్తులకు నమ్మకాన్ని కలిగించండి


తిమ్మాపూర్, ఆగస్టు 11 ( ప్రజాజ్యోతి ): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతు వేములవాడ నియోజకవర్గం నుండి 2014 లో ఏ పార్టీ



నుండి పోటీ చేశారో,ఎందుకు చేశారోనని నియోజకవర్గ ప్రజలతో పాటుగా రాష్ట్ర ప్రజలకు ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేయాలని జగదీశ్వరాచారి డిమాండ్ చేసారు.బోనాల పండగకు అరకొర నిధులు కేటాయించడం పై కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ మాట్లాడితే మత రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించడం ఆది అహంకారానికి నిదర్శమని పత్రికా ప్రకటన లో పేర్కొన్నారు.2014 లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే బీజేపీని ఆశ్రయించి పోటీ చేసినప్పుడు తెల్వలేదా బీజేపీ,గురించని ప్రశ్నించారు.కాంగ్రెస్ లో ఉన్నప్పుడు కూడా స్థానిక దేవాలయ అభివృద్ధి గురించి ఎన్నడైనా మాట్లాడినారా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అంటే ముస్లిమ్స్,ముస్లిమ్స్ అంటే కాంగ్రెస్ అని మాట్లాడిన ముఖ్యమంత్రి మాటలు గుర్తుకు లేవా అంటూ ప్రశ్నించారు. అవకాశాల కోసం పార్టీలు మారిన మీకు బీజేపీ ని,బీజేపీ నాయకులను విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు.కేంద్ర నిధుల మంజూరు విషయంలో కేంద్ర నిధులు రాకపోతే గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణ వ్యాప్తంగా హిందువులకు జరుగుతున్న అన్యాయాలపై ఆది శ్రీనివాస్ ఎప్పుడైనా ప్రశ్నించారా అని అడిగారు.బైంసాలో హిందువుల ఇళ్లను తగులబెట్టినప్పుడు స్పందించింది,వారికి అండగా నిలిచింది బండి సంజయ్ కాకపోతే మీరా అని ప్రశ్నించారు. హిందువుల కోసం పోరాడేవ్యక్తిని విమర్శించే ముందు మీ పార్టీ ఏ,ఏ మతాలకు కొమ్ము కాస్తుందో ప్రజలందరికీ తెలుసని అన్నారు. బండి పై విమర్శలు మాని దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ రాజన్న ఆలయాన్ని వెంటనే పూర్తి చేసి అక్కడి ప్రజలకు, స్వామి వారి భక్తులకు,హైందవ జాతికి మీపైన నమ్మకాన్ని కలిగించికోండని సూచించారు.

## మన్నెంపల్లి లో మాల సంఘం ఏకగ్రీవ ఎన్నిక

తిమ్మాపూర్, ఆగస్టు 11 ( ప్రజాజ్యోతి ): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలొ మాల మహానాడు సంఘం నూతన గ్రామశాఖ ఎన్నికను మంగళవారం ఏకాగ్రవం గా జరిగినది.నూతన



అధ్యక్షులుగా బూడిద కొమురయ్యా, ఉపాధ్యక్షులు అసోధ భూమయ్య, ప్రధాన కార్యదర్శి అసోధ బాలయ్య కోశాధికారి తుమ్మల రమేష్ ఆర్గనైజర్ బూడిద వెంకటి గౌరవ అధ్యక్షులు అసోధ అంజయ్య బూడిద రమేష్ కార్యవర్గ సభ్యులు మేడి హరీష్ బూడిద సంపత్ మాల సంగ సభ్యులు బూడిద శ్రీనివాస్ వేముల దేవేందర్ బూడిద రాజయ్య బూడిద పోచయ్య అసోధ చంద్రయ్య అసోధ కనుకయ్య అసోధ మహేష్ వేముల సంపత్ బూడిద అక్షయ్ బూడిద అశోక్ బూడిద రాజు అసోధ రాజమల్లు బూడిద మోహన్ నూతన గ్రామ శాఖ ఎన్నికలో తదితరులు పాల్గొన్నారు

## శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ,ఆగస్టు,11:ప్రజాజ్యోతి: అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయానికి





చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకురాలు పాత సత్యలక్ష్మి, మాజీ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# వేతనాలు ఇయ్యండి సారు..!

● పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు విడుదల చేయాలి

**నేలకొండపల్లి, ఆగస్టు 11 ప్రజా జ్యోతి,:** పంచాయతీ ఆపరేటర్ల కు పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఆపరేటర్ల సంఘం నాయకులు బీ. నవీన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం లో ఎంపీడీఓ, మండల పంచాయతీ అధికారులకు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పంచాయతీలలో పారదర్శక సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగు నెలలు గా వేతనాలు చెల్లించకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ. వైద్య ఖర్చుల. ఇంటి అద్దెల కోసం అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ అప్సర్, టి.సునీత, కె.దివ్య, టి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.





# కారేపల్లిలో కధం తొక్కిన కార్మికులు

● జైల్ భరో విజయవంతం

**కారేపల్లి, ఆగస్టు 09, ప్రజా జ్యోతి:** కేంద్రప్రభుత్వ కార్మిక, కర్షక, రైతు విధానాలపై నిరసిస్తూ సోమవారం దేశవ్యాప్తంగానిర్వహించిన జైలు భరో కార్యక్రమం కారేపల్లిలో విజయవంతమైంది. సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు కారేపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ లో రాస్తారోకో, మానహారం చేపట్టారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. కారేపల్లి ఎస్సై బైరు గోపీ ఆధ్వర్యంలో పోలీసులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ను అదుపులోకి తీసుకోని పోలీసు వాహనంలో స్టేషన్ కు తరలిస్తుండగా కార్మికులు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. వ్యకాస నేతను స్టేషన్ కు తరలించిన అనంతర మిగితానాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. పోలీస్ స్టేషన్ సైతం కార్మిక సంఘంనేతలునిరసన కార్యక్రమాన్ని సాగించారు. ఈసందర్భంగా వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర లు మాట్లాడతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పేదలు, కార్మికులు, రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పేదలకు పని కల్పించే ఉపాధి హామీ గ్యారెంటీ చట్టాన్ని కొనసాగించాలని ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించే రేషన్ షాపులను నిర్వీర్యం చేసి.నిరుపేదలకు 35 కేజీలబియ్యం అందజేసే ఏఏవై కార్డులకు బియ్యం కుదించిందన్నారు ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లతో కార్మికుల శ్రమను దోచుకోవటానికి కార్పొరేట్ సంస్థలకు హక్కు కల్పించారన్నారు. ఇక 12 గంటల పనివిధానం రానుందన్నారు పని భారం తగ్గించి కనీస వేతన చట్టం అమలు చేయాలని.వ్యవసాయ చట్టాలు, విద్యుత్ చట్టాలను తీసుకవస్తుందని దీంతో వ్యవసాయ రంగంలో చిన్న సన్నకారు రైతులపరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల నిరసన జైల్ భరోతో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేశగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, పాసిని నాగేశ్వరరావు, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు సురభాక ధనమ్మ, కొండబోయిన ఉమావతి, సీఐటీయు నాయకులు ముక్క సీతారాములు, అజ్మీర శోభన్, సోమందుల నాగమణి, ఎల్లబోయిన రాధ, గుర్రం వెంకటేశ్వర్లు, కేలోత్ రవి, శనగ రాంబాబు, ఆదెర్ల వినయ్, రేగళ్ల మంగయ్య, కరపటి సీతారాములు, కొండల్‌రావు, ఇస్మాయిల్, కళ్యాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




# కొత్తూరులో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

● రూ..40 వేలు విలువ గల విద్యా సామాగ్రి పంపిణీ

**సత్తుపల్లి ఆగస్ట్11(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పుట్టినరోజు సందర్భంగా, మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు,ఉప సర్పంచ్ గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు రూ..40 వేల రూపాయల విలువగల విద్యాసామాగ్రిని అందించేందుకు ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి హాజరైనారు. అనంతరం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి, పాలకవర్గం అందరూ కలిసి ఆమెకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు వాటర్ బాటిల్, పెన్ను,పెన్సిల్,ప్యాడ్,బ్యాగులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ మనకు అండగా ఉన్నారని,సీఎం రేవంత్ రెడ్డి విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి,విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు కాబట్టి, ప్రతి విద్యార్థి మంచిగా చదువుకొని, ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు తోగర్త రంగమ్మ, కోలికపోగు రాధా, కుర్రపాటి శ్యామల,ఇటుకల గోపి, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి నరసారెడ్డి, దేశి రెడ్డి వెంకట్రామిరెడ్డి, బొమ్మ రెడ్డి కేశవరెడ్డి, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, సత్తిబాబు, అద్దేపల్లి రవి, పరసా రాంబాబు,నాగు,పెద్ద గోపి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎమ్మెల్యే రాగమయి జన్మదిన వేడుకలు

● విద్యార్థులకు రూ..12 లక్షల విద్యా సామాగ్రి పంపిణీ చేసిన కలెక్టర్ దివాకర్ టిఎస్

● ఆషా స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలను అభినందించిన కలెక్టర్

**సత్తుపల్లి ఆగస్టు11(ప్రజా జ్యోతి)** ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల నడుమ ఘనంగా మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ హాజరైనారు. ముందుగా ఆమె జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి,విద్యార్థులు అందరూ కలిసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పుస్తకాలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్యాగులు, ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు, కళాశాల యూనిఫాం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషా స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, మోటివేషన్ క్లాసెస్ ద్వారా విద్యార్థిని,విద్యార్థులకు భవిష్యత్తులో మంచి మార్పు తీసుకొస్తాయని,విజయాలు వరిస్తాయని అన్నారు. రూ..12 లక్షల రూపాయలతో విద్యార్థులకు, విద్యకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేయటం గొప్ప విషయం అని డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ను అభినందించారు. నియోజకవర్గంలో ఆషా స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు చూపిస్తున్న చదువుపై ప్రత్యేక శ్రద్ధ,వారి జీవన విధానాన్ని మార్చివేస్తుందని తెలిపారు. సేవ సంస్థల ద్వారా విద్యార్థులకు ఇలా ఉపయోగపడే విషయాలు చేయాలని,ప్రభుత్వం కూడా మంచిగా సహకరిస్తుందని విద్యార్థులు ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకొని,ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో, ఎంఈఓ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు, మట్టా అభిమానులు విరివిగా పాల్గొన్నారు.







# "సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో మిస్ట్ విద్యార్థుల ప్రతిభ



**సత్తుపల్లి ఆగస్ట్11(ప్రజా జ్యోతి)** గత జూన్ నెలలో నిర్వహించిన విద్యా సంవత్సరానికి గాను, మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అటానమస్ హోదాలో నిర్వహించిన బీటెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఉత్తమ ఫలితాలను సాధించారని, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరి కృష్ణ మంగళవారం తెలియజేశారు. బ్రాంచులు వారీగా విద్యార్థులు సాధించిన సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ యావరేజ్(ఎస్. జి .పి .ఏ ను) ప్రిన్సిపల్ తెలిపినారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు ఈ. ఈ. ఈ నుండి దంతాల కీర్తన 9.3, చీకటి కృష్ణ కౌశిక్ 9.15 ,తేజవత్ సిద్ధు 8.9 ఎస్ జి పి ఏ లు, మెకానికల్ ఇంజనీరింగ్ నుండి జూపర్తి చరణ్ 6.34 ఎస్ జి పి ఏ లు ఈ .సి. ఈ నుండి. గుత్తి యూనిష 9.85, బుడ్డి. ప్రశాంతి 9.7 కటికీ. శరణ్య 9.7, ఎర్రమళ్ళ లక్ష్మి 9.25 ఎస్ జి పి ఏ లు సి. ఎస్. సి నుండి కటికి నాగరాజు 9.45, పిన్నం లక్ష్మీ గాయత్రి 9.25, చింతలపాటి నాగేశ్వరి 9.05 ఎస్ జి పి ఏ లు, సి .ఎస్. ఎం నుండి ముచ్చింతల అమృత వర్షిని 9.95, మహమ్మద్. సోఫియా 9.7, వర.అంజలి 9.7, కోలా. నిఖిల 9.7 ఎస్ జి పి ఏ లు, సి. ఎస్ .డి బ్రాంచ్ నుండి కానూరి సువర్చల నాగ అంశిక 9.6 ,రాళ్ల బండి ప్రసన్నలక్ష్మి 9.5, మల్లెల్లి సాయిరాం కృష్ణ 9.25 జీపీఏలు పైన పేర్కొన్న ఫలితాలలో ఈ ఈ ఈ విభాగం నుండి నుండి 9 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించిన విద్యార్థులు 02 ,8 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించిన విద్యార్థులు 03, ఈ సి ఈ విభాగం నుండి 9 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించిన విద్యార్థులు 04, 8 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించిన విద్యార్థులు06 సిఎస్సి విభాగం నుండి 9 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు03 8 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు08 సి ఎస్ ఎం విభాగం నుండి 9 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు14 , 8గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు10 సి ఎస్ డి విభాగం నుండి9 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు04 8 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థులు05 పైన పేర్కొన్న అన్ని విభాగాల నుండి 9 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించిన విద్యార్థులు 27, 8 గ్రేడ్ పాయింట్స్ పైన సాధించిన విద్యార్థులు32 ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ మదర్ తెరిసా విద్యాసంస్థల ప్రెసిడెంట్ చలసాని సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐ. క్యు. ఎ .సి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి రామచంద్ర రావు , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సాయి ఇంద్రసేనారెడ్డి,వివిధ విభాగాల అధిపతులు ,అధ్యాపకులు మరియు బోధ నేతర సిబ్బంది అభినందించారు.

# భట్టి విక్రమార్క కృషితో గ్రామీణ రహదారుల అభివృద్ధి

● రూ.6.80 కోట్లతో నిర్మిస్తున్న రేపల్లెవాడ-లక్ష్మీపురం-పొద్దుటూరు రహదారి పరిశీలన


**చింతకాని ఆగస్టు 11ప్రజాజ్యోతి :**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి కృషితో రేపల్లెవాడ నుంచి లక్ష్మీపురం మీదుగా పొద్దుటూరు వరకు రూ.6.80 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావుతో కలిసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ ముఖ్య నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా కన్నెబోయిన గోపి యాదవ్ మాట్లాడుతూ చింతకాని మండలంలో ముఖ్యమంత్రి శ మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.నిన్న నాగులవంచ గ్రామంలో అంబటి వెంకటేశ్వరరావుపై దురుద్దేశపూర్వకంగా ఒక రైతును అడ్డం పెట్టుకుని విమర్శలు చేయడం సరికాదన్నారు.భట్టి విక్రమార్క సారథ్యంలో చింతకాని మండలంతో పాటు నాగులవంచ గ్రామంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతోందని, ఈ అభివృద్ధి పనుల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు కీలక పాత్ర పోషిస్తున్నారని గోపి యాదవ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, అడ్డంకులు సృష్టించినా భట్టి విక్రమార్క గారి నేతృత్వంలో మధిర నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, నాగులవంచ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మడుపల్లి రాంప్రసాద్, రైతులు మడుపల్లి చిన్న నాగేశ్వరరావు, మడుపల్లి వెంకటేశ్వర్లు, బొర్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదు

● దళిత జర్నలిస్టులపై వేధింపులు ఆపాలి: గద్దల రామకృష్ణ

**అశ్వాపురం, ఆగస్ట్ 11,ప్రజాజ్యోతి:** జర్నలిస్టులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, కేసులతో వేధించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని దళిత సంఘం నాయకుడు గద్దల రామకృష్ణ అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అని, వారు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించే అవకాశం కల్పించాలని కోరారు. వార్తలపై అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా వివరణ కోరాలే తప్ప జర్నలిస్టులను భయపెట్టేలా వ్యవహరించకూడదన్నారు. ముఖ్యంగా దళిత జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను తమ సంఘం సహించదని, ఇలాంటి ఘటనలు కొనసాగితే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఐక్యంగా స్పందిస్తామని హెచ్చరించారు. అధికారులు ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించి పత్రికా స్వేచ్ఛను, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని రామకృష్ణ కోరారు.



# ఎమ్మెల్యే డిపిఆర్ టెండర్ రద్దు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

● 8కోట్ల స్కాంలో సూత్రధారులు ఎవరు? ● మున్సిపల్ అధికారులపై పిర్యాదు చేస్తాం

● జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 11 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి పారదర్శకత లేకుండా నిర్వహించిన రూ.9 కోట్ల 60 లక్షల డిపిఆర్ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేసి ఎమ్మెల్యే కూనంనేనీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని జైభీమ్ రావు భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.మంగళవారం జేబీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం డిపిఆర్ లో 9 కోట్ల 60 లక్షల విలువచేసే టెండర్ ను కేవలం మూడు రోజులు మాత్రమే సమయం కేటాయించి మూడు రోజుల్లోనే టెండర్ ఓపెన్ చేయడం పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకమని కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినప్పుడు వాటిని రద్దు చేసి మరల టెండర్ నిర్వహించాల్సి ఉండగా కానీ దానికి విరుద్ధంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టెండర్ ఓపెన్ చేశారని,నిబంధనలను తుంగలో త్రొక్కి టెండర్ ఓపెన్ చేసిన అధికారులపై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.9కోట్ల 60 లక్షల పనికి కనీసం 14 రోజుల గడువు ఇవ్వాలనే ఈ ప్రొక్యూర్మెంట్ నిబంధనలు ఉన్నాయని అన్నారు. టెండర్ ప్రక్రియలో 8 కోట్ల స్కామ్ జరిగే అవకాశం ఉందని అసలు 8కోట్ల స్కాంలో సూత్రధారులు ఎవరని ప్రశ్నించారు? అధికారులు, స్థానిక శాసనసభ్యులు తక్షణమే టెండర్ రద్దు చేయాలని, లేనియెడల కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి డిపిఆర్ టెండర్ రద్దు అయ్యేవరకు పోరాడుతామని, అవసరమైతే న్యాయస్థానానికైనా వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జునరావు, కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల రవికుమార్, పట్టణ అధ్యక్షుడు గజ్జల శంకర్, వినయ్, సోను, మున్నా తదితరులు పాల్గొన్నారు.









# సీఎం సభకు ఏర్పాట్లు

## పరిశీలించిన కలెక్టర్, సిపి

## ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు

## కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

పరకాల, ఆగస్టు 11,(ప్రజాజ్యోతి): పరకాలలో ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొనే సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాల్లో సభా వేదిక, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌కు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, ఆసుపత్రి ప్రారంభోత్సవం, సభా ప్రాంగణం, ప్రజల రాకపోకలు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సీపీ ఎన్.శ్వేత మాట్లాడుతూ సీఎం భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ హెలిప్యాడ్, రూట్‌మ్యాప్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం రూట్‌మ్యాప్, భద్రత, పార్కింగ్ ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సురేష్‌బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్‌కుమార్, కమిషనర్ పవన్, ఏసీపీ సతీష్‌బాబు, పరకాల సీఐ క్రాంతికుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్లకు ఈ నెల 31 వరకు దరఖాస్తులు

### అర్హుల గుర్తింపులో అలసత్వం వద్దు

### కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 11(ప్రజా జ్యోతి): జిల్లాలో చేయూత పెన్షన్ పథకానికి అర్హులైన వారిని గుర్తించి, ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్




తివారి అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఈలు, ఏఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయూత పెన్షన్ దరఖాస్తులను స్వీకరించి, మాడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలన, వెరిఫికేషన్ చేపట్టాలని సూచించారు. దరఖాస్తుల డేటా ఎంట్రీలో తప్పులు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఏ లాగిన్‌లో ఎవరు డేటా ఎంట్రీ చేశారనే వివరాలు రికార్డవుతాయని, తొందరపాటుతో తప్పుల సమాచారం నమోదు చేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మొదటి విడత స్కూల్ యూనిఫారాలను ఆయా పాఠశాలల్లో అందించాలని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని, అర్హులైన లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపీడీవోలు తమ పరిధిలోని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

మొదటిపేజీ తరువాయి..

సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు




చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# రేవంత్ షెల్ కంపెనీల అక్రమ కేటాయింపు

మొదటిపేజీ తరువాయి..

కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ




భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# పాలిమర్ నోట్ల ట్రయల్స్‌కు గ్రీన్‌సిగ్నల్

మొదటిపేజీ తరువాయి..

వెల్లడించారు. పాలిమర్ నోట్లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కేంద్ర బోర్డు సిఫార్సుతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఆర్బీఐ చట్టం-1934లోని సెక్షన్ 25 ప్రకారం ఆ ప్రతిపాదనను కేంద్రానికి సమర్పించింది. రూ.10, రూ.20 విలువలతో ఒక్కో డినామినేషన్‌కు 100 కోట్ల పాలిమర్ నోట్లను ముద్రించి ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహించాలని ప్రతిపాదించింది. ఆ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్‌లో పాలిమర్ నోట్లను సాధారణంగా చలామణిలోకి తీసుకురావాలని ఆర్బీఐ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని ఆర్థిక మంత్రి వెల్లడించారు. అయితే ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావడం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్లు ప్రవేశపెట్టినప్పటికీ కాగితపు నోట్లు కూడా చలామణిలో కొనసాగుతాయని తెలిపింది. అంటే కొంతకాలం పాటు రెండు రకాల నోట్లు ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి. అయితే పాలిమర్ నోట్ల కొనుగోలు ప్రక్రియ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని ఆర్బీఐ కేంద్రానికి సమాచారం ఇచ్చింది. దీంతో ఫీల్డ్ ట్రయల్స్ ఎప్పుడు ప్రారంభమవుతాయి? సాధారణ చలామణిలోకి పాలిమర్ నోట్లు ఎప్పుడు వస్తాయి? అనే విషయాలపై ప్రస్తుతం కచ్చితమైన సమయం చెప్పడం సాధ్యం కాదని నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే ఈ ప్రక్రియకు ఎంత ఖర్చవుతుందనే విషయాన్ని కూడా ఇప్పుడే నిర్ధరించలేమని చెప్పారు. మరోవైపు, దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతోందని కేంద్రం వెల్లడించింది. వినియోగదారుల ధరల సూచీ (జూ×) ఆధారంగా నమోదయ్యే సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 2023-24లో 5.4 శాతంగా ఉంది. 2024-25లో ఇది 4.6 శాతానికి తగ్గింది. 2025-26లో మరింత తగ్గి 2.1 శాతానికి చేరిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అయితే 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం కొంత పెరిగింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా వస్తువుల ధరలపై ప్రభావం పడటం, అంతర్జాతీయ ఇంధన ధరలు అధికంగా ఉ ండటం, కూరగాయల ధరల్లో పెరుగుదల, ఎల్‌నినో పరిస్థితులు వంటి కారణాలతో 2026-27 తొలి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.9 శాతానికి చేరిందని ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ ఇది ఆర్బీఐ నిర్దేశించిన 4 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యానికి దిగువనే ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## జనగణమన తరహాలో వందేమాతరం

మొదటిపేజీ తరువాయి..

ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది. ÷రిత్త చట్టం ప్రకారం 'వందేమాతరం' గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

## ఆ సంస్థతో సీఎం సోదరుడికి సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి..

చేశారంటూ ఆయన అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఎకరం రూ.90లక్షలకు ఇస్తే.. మేం రూ.కోటిన్నరకు ఇచ్చాం. బోర్డు డిసైడ్ చేసిన దానికంటే రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదు. 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెసరాట్ కంపెనీ. నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయి. ఆ సంస్థతో సీఎం రేవంత్ సోదరులకు సంబంధం లేదు. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆయన ఆరోపణలు చేయడం.. ఐదు



ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల సంస్థగా కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? తక్కువ ధరకు ఎందుకు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి. మీడియాలో వస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. పీఎం ఏక్తామాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయి. పరిశ్రమలు రావొద్దనే హిడెన్ అజెండాతో కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నా శాఖలో జరిగే ప్రతి నిర్ణయం నాకు తెలుసు. ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారు. అప్పుడు కేటీఆర్‌కు తప్పనిపించలేదా అని అన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కలలో మాటని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

మొదటిపేజీ తరువాయి..

విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుల్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల



3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుల్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

## బషర్ అల్-అసద్‌కు ఉరిశిక్ష

మొదటిపేజీ తరువాయి..

పాల్పడినందుకు గానూ న్యాయస్థానం ఈ తీర్పునిచ్చింది. అసద్‌తో పాటు ఆయన సోదరుడు మాహెర్ అల్-అసద్, బంధువు నజీబ్‌కు కూడా ఉరిశిక్ష ఖరారు చేసింది. 2024 డిసెంబర్‌లో అసద్ ప్రభుత్వం కూలిపోవడంతో ఆయన తన కుటుంబంతో సహా రష్యాకు పారిపోయారు. అయితే, సిరియాలోనే ఉండిపోయి నజీబ్ అధికారులకు పట్టుబడ్డారు. చిన్నపిల్లలను చంపడం, ప్రజలను చిత్రహింసలు పెట్టడం లాంటి దారుణాలకు నజీబ్ పాల్పడినట్లు కోర్టు నిర్ధారించింది. సిరియా సైన్యంలో బ్రిగేడియర్ జనరల్‌గా పనిచేసిన నజీబ్ దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి అధిపతిగా వ్యవహరించారు. 2024 డిసెంబర్‌లో తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్‌ను ఆక్రమించుకోవడంతో అసద్ తన కుటుంబంతో కలిసి సిరియా నుంచి రష్యాకు పారిపోయారు. డిసెంబర్ 8న తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను పూర్తిగా హస్తగతం చేసుకున్నారు. దీనితో దాదాపు ఐదు దశాబ్దాలుగా సాగుతున్న అసద్ కుటుంబ నిరంకుశ పాలనకు తెరపడింది. అసద్‌ను గద్దె దించడంలో కీలక పాత్ర పోషించిన అహ్మద్ అల్ శారా ప్రస్తుతం సిరియా తాత్కాలిక అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

తీవ్రగాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం



జరిగింది. ప్రతిరోజు కూలి పని కోసం జహీరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు కూలీలు వస్తూ ఉ ంటారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఆయిల్ ట్యాంకర్ హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది

### నటుడు ప్రకాశ్ రాజ్ సెల్ఫీ వీడియో

బెంగళూరు,ఆగస్ట్11(ప్రజాజ్యోతి): బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు. సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉ న్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు. ఇక ప్రకాశ్ రాజ్‌కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967